News Daily
ఎడిటర్ : B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

CK NEWS చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 05 | సంచిక :141 | ఖమ్మం | మంగళవారం, జూన్ 30, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



## గ్రామీణాభివృద్ధి పథకాల్లో తెలంగాణ
# వెనుకబాటు

గామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది కావాలి

పీఎంజీఏసీవై రహదారుల పనులు వేగవంతం కావాలి

కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు

గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయా పథకాల అమలును పరిశీలించినప్పుడు ఇది కనిపించిందన్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రంపై ఆయన వ్యాఖ్యలు చేశారు. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గురించి ఆయన మాట్లాడుతూ.. పీఎంజీఏసీవై రహదారుల పనులు వేగవంతం కావాలని చెప్పారు. పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు. పీఎం ఆవాస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రితోపాటు ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి శాఖలో ఖాళీలు

వివరాలు 2లో..

## కేంద్రం సహకరిస్తేనే రాష్ట్రాల అభివృద్ధి సాధ్యం

వీబీ జీ రామ్ జీ పథకంపై అభ్యంతరాలున్నాయ్

పాత విధానంలోనే 75 శాతం కాంపోనెంటట్ కొనసాగించాలి

60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు

గ్రామీణాభివృద్ధిశాఖ సమావేశంలో సీతకక్క స్పష్టీకరణ




కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి పథకాలకు సంబంధించి తీసుకువస్తున్న సరికొత్త నిధుల విధానాలపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వీబీ జీ రామ్ జీ పథకంపై అభ్యంతరాలను కేంద్రానికి మంత్రి సీతక్క తెలియజేశారు. సోమవారం ఢిల్లీలో జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సుకు సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణాభివృద్ధి పథకాల అమలును జాతీయ సదస్సులో కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్ జీపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. వీబీ జీ రామ్ జీ పథకం

వివరాలు 2లో..



# ముఖం చాటేసిన నైరుతి

## దేశవ్యాప్తంగా వర్షాల కోసం ఎదురుచూపు

ఏరువాక సాగక రైతన్న ఆందోళన

దేశంలో నైరుతి రుతుపవనాలు జూన్ 4న కేరళ తీరాన్ని తాకినప్పటికీ, దేశంలోని చాలాప్రాంతాలు ఇంకా వర్షాల కోసం వేచి చూస్తున్నాయి. గత 146 ఏండ్ల వాతావరణ చరిత్రలో ఈ జూన్ నెల అత్యంత పొడిగా నమోదైన నెలల్లో ఒకటిగా నిలిచిందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. మొత్తంగా దేశంలో నైరుతి రుతుపవనాలు మళ్లీ ముఖం చాటేశాయి. జూన్ 4 నుంచి 28 మధ్య సాధారణంగా 141.4 ఎంఎం వర్షం కురువాల్సి ఉండగా, ఈసారి 77.1 ఎంఎం వర్షపాతమే నమోదైంది.

దేశంలో నైరుతి రుతుపవనాలు జూన్ 4న కేరళ తీరాన్ని తాకినప్పటికీ, దేశంలోని చాలాప్రాంతాలు ఇంకా వర్షాల కోసం వేచి చూస్తున్నాయి. గత 146 ఏండ్ల వాతావరణ చరిత్రలో ఈ జూన్ నెల అత్యంత పొడిగా నమోదైన నెలల్లో ఒకటిగా నిలిచిందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. మొత్తంగా దేశంలో నైరుతి రుతుపవనాలు మళ్లీ ముఖం చాటేశాయి. జూన్ 4 నుంచి 28 మధ్య సాధారణంగా 141.4 ఎంఎం వర్షం కురువాల్సి ఉండగా, ఈసారి 77.1 ఎంఎం వర్షపాతమే నమోదైంది. కదిలే మేఘాలు ఈశాన్య రాష్ట్రాలు, బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాలు, దక్షిణ-మధ్య అరేబియా సముద్రానికే పరిమితమయ్యాయి. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన వర్షపాతం పటం రుతుపవనాల అస్థిర ప్రభావాన్ని తెలియజేస్తున్నది.

వివరాలు 2లో..

## జీవితం అంటే వందమీటర్ల
# పరుగుపందెం కాదు


ఓపిక, నిలకడ శక్తితో చేపట్టిన పనులు పూర్తిచేయాలి

వీబీఐటీలో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్‌లో నితిన్ నబీ

వర్చువల్‌గా పలు జిల్లాల కార్యాలయాలు ప్రారంభం

తెలంగాణలో బిజెపి అధికారానికి ఎంతో దూరం లేదని వ్యాఖ్య






జీవితం వంద మీటర్ల పరుగుపందెం కాదని.. మన ఓపికకు పరీక్ష అని భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ వీబీఐటీ క్యాంపస్‌లో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్‌లో ఆయన పాల్గొన్నారు. భాజపా యువ మోర్చా ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. రాజకీయాల్లో ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారని ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. చిన్న వయసులోనే అనుకోకుండా

వివరాలు 2లో..

## అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

- అత్యవసర విచారణకు సుప్రీం తిరస్కరణ
- అంత తొందరెందుకని పిటిషన్‌కు ధర్మాసనం ప్రశ్న
- 8మంది నిందులకు 14రోజుల రిమాండ్

అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. ఈ ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు. కోర్టు పర్యవేక్షణలో, నిర్ణీత కాలవ్యవధిలో దర్యాప్తు జరిగేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే ఈ పిటిషన్ అత్యవసర విచారణకు సుప్రీం

వివరాలు 2లో..

## మరోసారి రాజ్యసభ ప్రతిపక్ష నేతగా ఖర్గే

ప్రమాణ స్వీకారం చేయించిన ఉపరాష్ట్రపతి

రాజ్యసభకు తిరిగి ఎన్నికైన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రతిపక్ష నేతగా మళ్లీ గుర్తింపు పొందారు. ఆయన పదవీకాలం ఈనెల 25తో ముగియనుండగా ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో తిరిగి ఎన్నికయ్యారు. దీంతో రాజ్యసభ ఛైర్మన్ రాధాకృష్ణన్ ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించారు.

వివరాలు 2లో..



## నేటి నుంచి రైతుభరోసా
# నిధుల విడుదల

- 2 ఎకరాల వరకు రైతుభరోసా నిధుల జమ
- తొలివిడతలో 41.37 లక్షల మందికి లబ్ధి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల వెల్లడి



రైతుభరోసా నిధుల విడుదలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. నేటి నుంచి రైతుల ఖాతాల్లో నిధుల జమ చేస్తామని తెలిపారు. అర్హులైన అన్నదాతలకు పెట్టుబడి సాయంగా దశలవారీగా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. మొత్తంగా 10 రోజుల్లో అందరికీ నిధులు జమచేస్తామన్నారు. రైతు భరోసా నిధుల విడుదల కోసం రైతు ఆశీర్వాద సభకు బదులుగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో 'రైతు భరోసా పంపిణీ సదస్సు'గా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

వివరాలు 2లో..

## రైతు ఆశీర్వాద సభ
# వాయిదా

- రైతు భరోసా పంపిణీ తరువాత రైతు ఆశీర్వాద సభ
- వరుణుడు కూడా కరుణించడం ఆనందదాయకం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- భారీ వర్షాలతో సీఎం ఆశీర్వాద సభ రద్దు
- నేడు శిల్పకలా వేదికగా రైతుభరోసా నిర్వహణ

ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరణ దేవుదు కూడా కరుణించడాని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భారీ వర్షాల కారణంగా ఈ నెల 30న తలపెట్టిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల సభా ప్రాంగణం అంతా బురదమయంగా మారిందని ఆయన చెప్పుకొచ్చారు.

వివరాలు 2లో..



## జీడబ్ల్యూఎంసీపై కమలం జెండా లక్ష్యం

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్

బూత్ స్థాయి కార్యకర్తలతో విజయమే ధ్యేయమని బీజేపీ నేతల పిలుపు..

కేంద్ర నిధులు, అభివృద్ధి పనులే ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. వరంగల్‌లో నిర్వహించిన బూత్ అధ్యక్షుల సమావేశం, గిరిజన నేతల సమ్మేళనంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ వరంగల్‌లో బీజేపీ మేయర్‌ను గెలిపించడమే పార్టీ ప్రధాన లక్ష్యమన్నారు. బీజేపీ మేయర్ ఎన్నికైతేనే కేంద్రం నుంచి మరిన్ని నిధులు వస్తాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. స్మార్ట్ సిటీ నిధులు, భద్రకాళి బండ్ అభివృద్ధి, కాజీపేట వ్యాగన్ పరిశ్రమ,

వివరాలు 2లో..

## తెలంగాణలో పలువురు ఐపీఎస్‌ల బదిలీ

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

భారీగా అటవీ అధికారుల బదిలీలు

అరణ్య భవన్‌కు విఎస్ఎన్‌వి ప్రసాద్




తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పోలీసు శాఖలో ఐపీఎస్, ఎస్‌పీఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగులు చేపట్టింది. ఈ మేరకు జీఓ ఆర్.టి. నెం.931ను జారీ చేసింది. పలువురు అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించగా, మరికొందరికి అదనపు బాధ్యతలు కేటాయించింది. రామగుండం పోలీస్ కమిషనర్‌గా కొనసాగుతున్న అంబర్ కిశోర్ ఝాకు డీఐజీ, జోన్-1 (కాళేశ్వరం) అదనపు బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి. జోయెల్ డేవిస్‌కు డీఐజీ, జోన్-5 (యాదాద్రి) బాధ్యతలు కూడా అప్పగించారు. వరంగల్ పోలీస్

వివరాలు 2లో..

## మళ్లీ మొదటికొచ్చిన పశ్చిమసియా !

ట్రంప్ ప్రపంచానికి పట్టిన పీడలాగా తయారయ్యాడు. అటు దేశ ప్రజలకు, ఇటు ప్రపంచ ప్రజలకు ఎప్పుడీ పీడ విరగడ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. శాంతి చర్చల అనంతరం ఒప్పందం చేసుకున్న తరవాత కూడా ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడంతో పశ్చిమాసియాను మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. ట్రంప్ చేస్తున్న ప్రకటనలకు, చర్యలకు పొంతన లేకుండ ఆపోయింది. దీంతో మళ్లీ యుద్ధం వస్తుందా అన్న భయంలో అనేక దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఇకపోతే ఇటలీవల చేసుకున్న ఒప్పందాన్ని కూడా ట్రంప్ ఖాతరు చేయలేదు. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందానికి పురిట్లోనే గండిపడింది. శనివారం మొదలైన పరస్పర దాడులు ఆదివారం మరింత ఉధృతం కావడంతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చిందా అన్న ఆందోళన కలుగుతోంది. దాడులు ఆపకుంటే ఇరాన్‌ను భూమ్మీదే లేకుండా చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు హెచ్చరించగా... తమ జోలికి వస్తే అమెరికాకు నరకం చూపిస్తామంటూ ఇరాన్ కూడా అంతేదీటుగా స్పందించింది. దీనితో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. హోర్ముజ్ జలసంధిలో తమ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రయాణిస్తోందంటూ ఎవర్ లఫ్లీ అనే వాణిజ్య నౌకపై ఇరాన్ డ్రోన్ దాడి చేయడంతో ఉద్రిక్తత మొదలైంది. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందంటూ.. శనివారం హోర్ముజ్ జలసంధికి సమీపంలో ఇరాన్‌లోని లక్ష్యాలపై అమెరికా యుద్ధ విమానాలతో దాడులు చేసింది. దీనితో గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపైకి ఇరాన్ డ్రోన్లు క్షిపణులను ప్రయోగించింది. అమెరికా దాడులపై ఇరాన్ దీటుగా స్పందించింది. కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. కువైట్‌లోని అలీ అల్ సలేం వైమానిక స్థావరం, బహ్రెయిన్ పోర్ట్ సల్మాన్ వద్ద ఉన్న అమెరికా ఐదో నావికాదళ స్థావరం సహా ఎనిమిది కీలక సైనిక కేంద్రాలను ధ్వంసం చేశామని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) పేర్కొంది. అమెరికా చేసే ఎలాంటి దాడులకైనా మా స్పందన అత్యంత విధ్వంసకరంగా ఉంటుందని హెచ్చరించింది. కాగా, తమ దేశంవైపు వస్తున్న క్షిపణులు, డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలతో విజయవంతంగా అడ్డుకుంటున్నామని కువైట్ ప్రకటించింది. అయితే హోర్ముజ్ జలసంధిలో పనామా జెండాతో ప్రయాణిస్తున్న భారీ చమురు ట్యాంకర్ నౌక 'కికు'పై శనివారం రాత్రి దాడి జరిగింది. ఇది ఇరాన్ పనేనంటూ అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం తెల్లవారుజామున పర్షియన్ గల్ఫ్‌లోని ఇరాన్ దీవి 'ఖెష్మ్'పై, హోర్ముజ్ జలసంధి సమీపతీరంలోని సిరిక్, బందర్ ఈ లెంగే నగరాల్లో 10 ప్రాంతాలపై భారీస్థాయిలో దాడులు చేసింది. ఇరాన్ నిఘా, కమ్యూనికేషన్ వ్యవస్థలు, గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్లు, సముద్ర మందుపాతరల నిల్వ కేంద్రాలను ధ్వంసం చేసినట్టు ప్రకటించింది. ఈ దాడులకు సంబంధించి 38 సెకన్ల వీడియోను విడుదల చేసింది. పరస్పర దాడు లు కొనసాగుతున్నా హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయని.. అమెరికా నౌకాదళం పూర్తి అప్రమత్తత ఉందని పేర్కొంది. అమెరికా, ఇరాన్ చర్చలకు మధ్యవర్తిగా ఉన్న పాకిస్థాన్.. తాజా ఉద్రిక్తతలను తగ్గించేందుకు ప్ర యత్నాలు మొదలుపెట్టింది. దీనిపై పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఇరుదేశాల ప్రతినిధులను సంప్రదించారు. కాల్పుల విరమణ, అవగాహన ఒప్పందానికి కట్టుబడి ఉండాలని కరారు. ఇక యూరోపియన్ యూనియన్ విదేశాంగ విధానం చీఫ్ కాజా కల్లాస్, బహ్రెయిన్ విదేశాంగ మంత్రి రషీద్ కూడా ఇషాక్‌దార్‌తో మాట్లాడారు. కాగా కువైట్, బహ్రెయిన్‌లపై ఇరాన్ దాడులను గల్ఫ్ దేశాల కూటమి 'గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)' ఖండించింది. వెంటనే దాడులు ఆపాలని విజ్ఞప్తి చేసింది. అమెరికా చేసే ప్రతీ దాడికీ తమ ప్రతిదాడి ఉంటుందని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. కాల్పుల విరమణను అమెరికాయే ఉల్లంఘిస్తోందని, ఇది ఇలాగే కొనసాగితే శాంతి ఒప్పందం కోసం జరుగుతున్న దౌత్య ప్రయత్నాలన్నీ నిలిచిపోతాయని స్పష్టం చేసింది. ఈ మేరకు ఐఆర్‌జీసీ నావికాదళ కమాండర్ ప్రకటన చేశారు. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా తప్పుబట్టారు. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. ఇరాన్ మళ్లీ కాల్పు ల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో మా సైన్యం దాడులు చేయాల్సి వచ్చింది. ఇరాన్ ఎప్పటికీ పాఠం నేర్చుకునేలా కనిపించడంలేదు. మా సహనానికి హద్దు అంటూ ఉంటుంది. అది దాటితే మేం సైన్యంతోనే పని పూర్తి చేయాల్సి వస్తుంది. అదే జరిగితే ఇక ఇరాన్ అనే దేశమే ఉండదని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు.విదేశాల నుంచి భారత్‌కు సరుకు రవాణా చేస్తున్న ఏడు కార్గో నౌకలు గత మూడు రోజుల్లో హోర్ముజ్ జలసంధిని దాటాయి. వీటిలో 65 వేల టన్నుల రసాయన ఎరువులు తీసుకొస్తున్న రెండు నౌకలు శనివారం ఈ మార్గం గుండా వచ్చాయి. అంతకుముందు రోజు లక్ష టన్నులకు పైగా ముడి చమురుతో 'దేశ్ సురక్ష' ట్యాంకర్, 18,732 టన్నుల సరుకుతో 'ప్రభు పార్వతి' నౌక ఇదే మార్గం గుండా భారత్‌కు వచ్చాయి. ఇవిగాక మరో రెండు విదేశీ నౌకలు ఇదే మార్గంలో ప్రయాణించాయి. హోర్ముజ్ ద్వారా భారత్‌కు రావాల్సిన మరో 15కు పైగా నౌకలు తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్‌లో వేచి ఉన్నాయి. వీటిలో భారతీయ జెండా గల 10 నౌకలు ఉన్నాయి. వాటిలో నాలుగు ఎరువులను, మరొకటి ఇంధనాన్ని తీసుకురానున్నాయి. ఇప్పుడు ఉద్రిక్తతల కారణంగా పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆందోళన కలుగుతోంది.

## జీవితం అంటే వందమీటర్ల పరుగుపందెం కాదు



మొదటిపేజీ తరువాయి..

రాజకీయాల్లోకి వచ్చాను. రాజకీయాల్లోకి వచ్చాక నా భవిష్యత్తుపై గందరగోళంలో పడ్డాను. ఏ పని చేసినా నాదైన ముద్ర ఉండాలని గట్టిగా అనుకున్నాను. అప్పగించిన పనిని నిబద్ధతతో పూర్తి చేయడమే నా బలం. వేగంగా లక్ష్యాలు చేరాలనే ఆరాటంలో నేటి యువత ఉంది. ఏ పనినైనా ఓపిక, నిలకడ, శక్తితో చేసినప్పుడే ఫలితాలు వస్తాయని అన్నారు. ఇదిలావుంటే రంగారెడ్డి జిల్లా రూరల్ భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయాన్ని నితిన్ నబీన్ ఘనంగా ప్రారంభించారు. ఇదే సందర్భంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు వర్చువల్ విధానం ద్వారా మరో 9 జిల్లాల పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నితిన్ నబీన్ మాట్లాడుతూ.. నాటి నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు విముక్తి కల్పించిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు, అలాగే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. పార్లమెంట్‌లో నాడే తెలంగాణ వాణిని బలంగా వినిపించిన దివంగత నేత సుష్మా స్వరాజ్ సేవలను కూడా ఆయన ఈ సందర్భంగా స్మరించుకున్నారు. గతంలో దేశవ్యాప్తంగా బీజేపీ కేవలం రెండు లోక్‌సభ స్థానాలు గెలిచినప్పుడు.. అందులో ఒకటి తెలంగాణ నుంచేనని నితిన్ నబీన్ గుర్తుచేశారు. ఈ స్థాయికి చేరడానికి ఎంతో మంది పార్టీ కార్యకర్తలు తమ ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. తెలంగాణకు లీడర్లు ఎంతో దూరం లేరని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి మూలలోనూ కమలం వికసించి, భగవాధ్వజం ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై బీజేపీ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తారని, ప్రజావ్యతిరేక పద్ధతులను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుతారని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నో ఆటంకాలు ఎదురైనా తీవ్రంగా సంఘర్షణ చేసి ఎలాగైతే విజయం సాధించామో, తెలంగాణలోనూ అదే పునరావృతం అవుతుందన్నారు. బెంగాల్‌లో పార్టీని గెలిపించిన సునీల్ బన్సల్ ఇక్కడే ఉన్నారని, తెలంగాణలో కూడా అంతకన్నా ఎక్కువ కష్టపడి పార్టీని గెలిపించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్షిస్తున్న 'వికసిత భారత్' లక్ష్యం సంపూర్ణంగా నెరవేరాలి అంటే తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నితిన్ నబీన్ స్పష్టం చేశారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీ అధికారంలో ఉండే 'డబుల్ ఇంజన్ సర్కార్' వస్తేనే తెలంగాణ అన్ని రంగాల్లో అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల అసలైన కలలు సాకారం కావాలన్నా, ఒక వికసిత తెలంగాణ నిర్మాణం జరగాలన్నా ప్రజలంతా బీజేపీతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జరగబోయే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించబోతోందని ఆయన జోస్యం చెప్పారు. కాగా, సాయంత్రం వేళ నితిన్ నబీన్ పార్టీకి చెందిన బీఎల్ఓలు, బూత్ కమిటీ అధ్యక్షులు , ముఖ్య కార్యకర్తలతో సమావేశమై రాబోయే ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశర చేశారు.

## 'పశ్చిమాసియా ఉద్రిక్తలపై తాత్కాలిక చర్యలు

మొదటిపేజీ తరువాయి..

దేశాల ప్రతినిధులు ఖతార్‌లోని దోహాలో సమావేశం కానున్నారు. ఈ చర్చల్లో హోర్ముజ్ జలసంధిలో నౌకాయాన భద్రత, వాణిజ్య రవాణా పునరుద్ధరణ, ప్రాంతీయ స్థిరత్వం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. హోర్ముజ్‌లో వాణిజ్య నౌకల సురక్షిత ప్రయాణానికి హామీ ఇవ్వడానికి ఇరాన్ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు, ఇరాన్ నౌకాశ్రయాలపై అమలులో ఉన్న కొన్ని పరిమితులను సడలించే అంశాన్ని అమెరికా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇది పూర్తిస్థాయి శాంతి ఒప్పందం కాదని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు . ఇరాన్ అణు కార్యక్రమం, ఆర్థిక ఆంక్షలు, హోర్ముజ్ జలసంధిపై భద్రతా అంశాలు వంటి కీలక సమస్యలపై ఇంకా తుది అంగీకారం కుదరాల్సి ఉంది . ఇటీవలి ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరు దేశాలు పరస్పర దాడులు చేసుకున్నాయి. 24 గంటల వ్యవధిలోనే, అమెరికా రెండుసార్లు ఇరాన్ సైనిక స్థావరాలు, డ్రోన్ బేస్‌లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేసింది. మళ్లీ యుద్ధం మొదలయ్యే అవకాశాలున్నాయనే ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో ఇరు దేశాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి.

## జీడబ్ల్యూఎంసీపై కమలం జెండా లక్ష్యం

మొదటిపేజీ తరువాయి..

మామునూర్ విమానాశ్రయం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ వరంగల్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అందించాలని కోరారు. మామునూర్ విమానాశ్రయం త్వరలో ప్రారంభమవుతుందని, కాజీపేట రైల్వే



అభివృద్ధితో పారిశ్రామిక అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మాట్లాడుతూ 2028 అసెంబ్లీ ఎన్నికలకు జీడబ్ల్యూఎంసీ ఎన్నికలు సెమీఫైనల్స్‌లాంటివని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని, కేంద్ర సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చాలని పార్టీ శ్రేణులకు సూచించారు. గిరిజనుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించిందని చెప్పారు. అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు మాట్లాడుతూ వరంగల్‌కు కేంద్రం వేల కోట్ల రూపాయల నిధులు అందించిందని, జీడబ్ల్యూఎంసీలో బీజేపీ అధికారంలోకి వస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. బూత్ స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేసి గ్రేటర్ వరంగల్‌లో కమలం జెండా ఎగరేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక సహకారం

**అక్టోబర్ 25న హైదరాబాద్‌లో తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం**
**ఇరు సంస్కృతుల వైభవాన్ని ప్రతిబింబించే ప్రత్యేక వేదికగా హైదరాబాద్**
**భారత్‌లో కే-డ్రామాల ఆదరణతో సాంస్కృతిక అనుబంధం మరింత బలోపేతం**
**కళా-సాంస్కృతిక భాగస్వామ్యానికి ప్రాధాన్యం: మంత్రి జూపల్లి**

హైదరాబాద్,జూన్ 29: ఈ ఏడాది అక్టోబర్ 25న హైదరాబాద్‌లో తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం నిర్వహించాలని తెలంగాణ - కొరియన్ కల్చరల్ సెంటర్ లు సంయుక్తంగా సూత్రప్రాయ అంగీకారానికి వచ్చాయి. తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఇరు పక్షాలు చర్చించాయి. భారత్‌లోని కొరియన్ కల్చరల్ సెంటర్ డైరెక్టర్, భారతదేశంలోని కొరియా రాయబార కార్యాలయం కల్చర్ అండ్ ప్రెస్ కౌన్సిలర్ హ్వాంగ్ ఇల్యాంగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును డా. బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ గొప్ప చారిత్రక వారసత్వం, వైవిధ్యభరితమైన సంస్కృతి, సంప్రదాయ కళారూపాలు, ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ప్రతిపాదిత తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం ద్వారా ఇరు ప్రాంతాల కళలు, సంగీతం, నృత్యం, వంటకాలు, సంప్రదాయాలను ఒకే వేదికపై



ఆవిష్కరించే అవకాశం లభిస్తుందని, పర్యాటకాభివృద్ధితో పాటు ప్రజల మధ్య సత్సంబంధాలు మరింత పెరుగుతాయని తెలిపారు. భారత్‌లో, ముఖ్యంగా యువతలో కొరియన్ కే-డ్రామాలు, కొరియన్ వినోద కార్యక్రమాలకు ఓటీటీ వేదికల ద్వారా విశేష ఆదరణ లభిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ సాంస్కృతిక అనుబంధం తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించడంతో పాటు కళలు, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, సృజనాత్మక భాగస్వామ్యాలకు కొత్త అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. పర్యాటకం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ, సృజనాత్మక పరిశ్రమల రంగాల్లో కొరియాతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, వారసత్వ పరిరక్షణ, పర్యాటక ప్రోత్సాహం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో కిమ్ కాంగ్‌హూన్ (హెడ్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్, ఐఅఅఎ), ఇమ్ హ్యాజే (హెడ్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్, ఐఅఅఎ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కొరియా కాన్సుల్ జనరల్ సురేష్ చుక్కపల్లి పాల్గొన్నారు.

## 'ఉద్యోగుల ఆరోగ్య పథకం'నిధిపై ఉత్తర్వులు

మొదటిపేజీ తరువాయి..

జీవో 79 ప్రకారం ఇకపై ప్రతి ఉద్యోగి మూల వేతనం లేదా పెన్షనర్ల మూల పింఛను నుండి ప్రతి నెలా 1.5 శాతం మొత్తాన్ని ఈ ఈహెచ్ఎస్ హెల్త్ ఫండ్‌కు విరాళంగా కట్ చేయనున్నారు. మే 2026 నెలకు సంబంధించిన జీతాలు, పెన్షన్ల నుంచే ఈ కోత పక్రియ ప్రారంభం కానుంది. ఈ నిధుల కోత విధానంలో ఉద్యోగులపై అదనపు భారం పడకుండా, ఎక్కడా డబుల్ కటింగ్ జరగకుండా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. భార్యాభర్తలు ఇద్దరూ కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నప్పుడు, లేదా వారిలో ఒకరు ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి మరొకరు ప్రభుత్వ పెన్షనర్‌గా ఉన్నప్పుడు కేవలం ఒక్కరి జీతం నుండి మాత్రమే ఈ మొత్తాన్ని మినహాయిస్తారు. అలాగే ఒకే వ్యక్తి ప్రభుత్వ సర్వీస్ పెన్షన్ , ఫ్యామిలీ పెన్షన్.. ఇలా రెండు పింఛన్లు పొందుతున్నప్పుడు కూడా ఒకే ఒక కోతకు నిబంధనలను పరిమితం చేశారు. ఇలాంటి సందర్భాలలో డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు ఉద్యోగుల వివరాలను ఐఎఫ్ఎంఐఎస్-హెచ్ఆర్ఎంఎస్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్‌లో పక్కాగా నమోదు చేసి, పొరపాటున కూడా రెండోసారి కటింగ్ అవ్వకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఒకవేళ ఇప్పటికే ఎవరికైనా ఇలా అదనంగా డబ్బులు కట్ అయి ఉంటే, ఆ మొత్తాన్ని తిరిగి రీఫండ్ చేస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని మరింత సమర్థవంతంగా నడిపించేందుకు గానూ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్‌పర్సన్‌గా ఒక ప్రత్యేక బోర్డ్ ఆఫ్ ట్రస్టీలతో కూడిన 'న్యూ ఎంప్లాయ్ హెల్త్ కేర్ ట్రస్ట్' ని ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ఈ బోర్డులో ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు కూడా సభ్యులుగా ఉంటారు. ఉద్యోగులు, పెన్షనర్లు ఇచ్చే 1.5 శాతం వాటా నిధికి సమానంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వంతు మ్యాచింగ్ గ్రాంట్‌ను ఈ హెల్త్ కేర్ ట్రస్ట్‌కు జమ చేయనుంది. సేకరించిన నిధులన్నింటినీ ప్రత్యేక అకౌంట్ హెడ్ ద్వారా మెడికల్ అవసరాల నిమిత్తం భద్రపరుస్తారు.

## రైతు ఆశీర్వాద సభ వాయిదా

మొదటిపేజీ తరువాయి..

ఈ కారణం వల్ల రైతులకి ప్రజలకి కాంగ్రెస్ కార్యకర్తలకి ఎవరికి ఎలాంటి ఇబ్బందులు రాకూడదన్న ఉద్దేశంతోనే సభ నిర్వహణలో మార్పులు చేసినట్లు ఆయన చెప్పుకుచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో తలపెట్టిన రైతు ఆశీర్వాద సభ ప్రాంతాన్ని సోమవారం మధ్యాహ్నం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి పరిశీలన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లక్షలాది మంది రైతుల సమక్షంలో ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులందరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించాలని భావించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో ఇక్కడ సభ నిర్వహించడం అందరికీ ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు. తొలిరోజు ప్రారంభ సభగా అనుకున్న ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు రైతు భరోసా పంపిణీ పూర్తి అయిన తర్వాత మరింత ఉత్సాహంగా 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వర్షాలు తగ్గిన తరువాత వాతావరణ శాఖ నివేదికలను అనుసరించి ముఖ్యమంత్రి, కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు. సభ నిర్వహణ తేదీలపై ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే వాతావరణ శాఖ నుంచి వారం రోజుల ముందస్తు అంచనాలను తీసుకుంటుందని ఆయన అన్నారు. జులై నెల 3, 4 తేదీల వరకు వర్షాలు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు మరో వారం రోజుల వాతావరణ సమాచారాన్ని సేకరించాలని ఆదేశించాం. వాతావరణ పరిస్థితిని బట్టి ఈ సభను వచ్చే 6, 7 లేదా 8వ తేదీల్లో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సత్తెపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయిలతో పాటు జిల్లాలోని శాసనసభ్యులంతా సమన్వయంతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న మిగతా ఎమ్మెల్యేలు, ప్రజలు, రైతాంగ సోదరులు ఈ సభకు తరలిరావడానికి భారీ ఉత్సాహాన్ని చూపిస్తున్నారని, ప్రజలు ఊహించని రీతిలో ఈ సభ అత్యంత విజయవంతం కాబోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఖమ్మం జిల్లా మధిరలో మంగళవారం జరగాల్సిన రైతు ఆశీర్వాద సభ రద్దయ్యింది. వర్షాల కారణంగా సభ నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో మధిరలో జరగాల్సిన సీఎం రేవంత్ రెడ్డి సభలో మార్పులు చేశారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం హైదరాబాద్ శిల్పకళా వేదికకు మార్చారు. సాయంత్రిం ఈ వేదికలో రైతుభరోసా పంపిణీ సదస్సు నిర్వహించనున్నారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి.. రైతుభరోసా నిధులను విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని మంత్రులు, అధికారులను సీఎం ఆదేశించారు. మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురంలో మంగళవారం రైతు ఆశీర్వాద సభ జరగాల్సి ఉంది. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై.. రైతుభరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. దాదాపు లక్ష మందితో సభ నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకుని... అందుకు తగ్గట్టుగా జగన్నాథపురంలో ఏర్పాట్లు చేశారు. అయితే, రెండు రోజులుగా కురుస్తున్న భారీగా వర్షాలకు సభా ప్రాంగణంలో పెద్దఎత్తున వరద నీరు చేరుకుంది. దీంతో సభ నిర్వహించేందుకు అవకాశం లేదని మంత్రులు, సీఎంవో కార్యాలయానికి జిల్లా అధికారులు తెలియజేశారు. దీంతో ప్రభుత్వం మధిరలో సభను రద్దు చేసి.. సభా వేదికను హైదరాబాద్‌కు మార్చింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి రైతులు తమ తమ రైతు వేదికల నుంచి ఈ సమావేశంలో పాల్గొననున్నారు.



## తెలంగాణలో పలువురు ఐపీఎస్‌ల బదిలీ

మొదటిపేజీ తరువాయి..

కమిషనర్‌గా ఉన్న సున్‌ప్రీత్ సింగ్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ, డీఐజీ జోన్-3 (రాజన్న) అదనపు బాధ్యతలు ఇచ్చారు. హైదరాబాద్ నార్త్ రేంజ్ (లా అండ్ ఆర్డర్) జాయింట్ కమిషనర్‌గా ఉన్న ఎన్. శ్వేతను వరంగల్ పోలీస్ కమిషనర్‌గా నియమిస్తూ, డీఐజీ జోన్-4 (భద్రాద్రి) బాధ్యతలు కూడా అప్పగించారు. ఇంటెలిజెన్స్ సీఐ సెల్ డీఐజీగా కొనసాగుతున్న ఆర్. భాస్కరన్‌కు జోన్-2 (బాసర) డీఐజీ అదనపు బాధ్యతలు కేటాయించారు. స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ ఎస్.ఎం. విజయ్ కుమార్‌కు హైదరాబాద్ నార్త్ రేంజ్ జాయింట్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న చి. సింధు శర్మను ఇంటెలిజెన్స్ సీఐ సెల్ ఎస్పీగా బదిలీ చేసి, ఎస్ఐబీ ఎస్పీ బాధ్యతలు కూడా అప్పగించారు. ఎస్ఐబీ ఎస్పీగా ఉన్న వై. సాయి శేఖర్‌ను సికింద్రాబాద్ రైల్వే పోలీస్ ఎస్పీగా బదిలీ చేశారు. హైదరాబాద్ డీసీపీ (ఎస్ఎం అండ్ ఐటీ)గా ఉన్న చెన్నూరి రూపేష్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ చి. ప్రవీణ్ కుమార్లను సీఐడీ ఎస్పీలుగా నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆర్. వెంకటేశ్వర్లును హైదరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీగా నియమించారు. వనపర్తి అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఉన్న రాజేష్ మీనాను వికారాబాద్ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బదిలీ చేశారు. వికారాబాద్ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఉన్న బి. రాములు నాయక్‌ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేసి, డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

రాష్ట్రంలో పలువురు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉత్తర్వులను జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు అందరూ తక్షణమే తమ పాత విధులను వదిలి, కొత్తగా కేటాయించిన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేశారు. ప్రస్తుతం పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న వి.ఎస్.ఎన్.వి. ప్రసాద్ అరణ్య భవన్‌లో కీలక బాధ్యతలు అప్పగించింది . హైదరాబాద్‌లోని ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ కార్యాలయంలో ఆయనను కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు కొత్త అటవీ అధికారులను కేటాయిస్తూ ప్రభుత్వం బదిలీల జాబితాను విడుదల చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ అధికారిగా ఉన్న జి. కిష్ట గౌడ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అటవీ అధికారిగా బదిలీ కాగా, ఆయన స్థానంలో నిజామాబాద్ జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, ఎఈఃూ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ అధికారిగా నియమించారు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, ఎఈఃూ ను రంగారెడ్డి జిల్లా అటవీ అధికారిగా బదిలీ చేయగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అటవీ అధికారిగా ఉన్న ఎం. నవీన్ రెడ్డి, ఎఈఃూను మహబూబ్‌నగర్ జిల్లా అటవీ అధికారిగా నియమించారు. మరోవైపు ఆదిలాబాద్ జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఎఈఃూ ను నిజామాబాద్ జిల్లా అటవీ అధికారిగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

మొదటిపేజీ తరువాయి..

నిరాకరించింది. అయోధ్య రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం జరిగిందంటూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, పిటీషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, రామమందిర విరాళాల నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని, ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర విచారణ జరిపించాలని కోర్టును కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోందని, అందుకే స్వతంత్ర దర్యాప్తు అవసరమని ఆయన వాదించారు. ఇక, కేసు ఆలస్యమైతే ఎలక్ట్రానిక్ ఆధారాలు చెరిపివేసే అవకాశం ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కోర్టు, మెన్షన్ స్లిప్ సర్క్యులేట్ చేయాలని సూచించింది. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తిరిగి ప్రారంభమైన వెంటనే ఈ కేసును లిస్ట్ చేసి విచారణ చేపడతామని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ప్రస్తుతం ఈ అంశంపై అత్యవసర విచారణ అవసరం లేదని స్పష్టం చేసింది. ఈలోపే మిన్ను విరిగి మీద పడదు.. అంత తొందరెందుక'ని పిటిషనర్‌ను ప్రశ్నించింది. మరోవైపు, ఈ కేసులో నిందితుల పక్షాన ఎవరూ వాదించొద్దన్ని÷జాబాద్ బార్ అసోసియేషన్ నిర్ణయించింది. 'ఈ కేసులో నిందితుల తరఫున ఎవరూ వాదించరు. ఒకవేళ ఎవరైనా అలా చేస్తే.. క్రమశిక్షణా చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది. వారికి రూ.5లక్షలు జరిమానా విధిస్తాం' అని అసోసియేషన్ అధ్యక్షుడు కలికా ప్రసాద్ మిశ్రా మీడియాకు వెల్లడించారు. 2005లో కూడా అక్కడి న్యాయవాదులు ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారు.

# రేపటి సీఎం బహిరంగ సభ రద్దు.




**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** మధిర నియోజకవర్గం చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డు వద్ద రేపు జరగాల్సిన సీఎం బహిరంగ సభ రద్దు.
వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతు భరోసా నిధుల విడుదల సభను వాయిదా వేసిన అధికారులు
నిన్నటి భారీ వర్షం, ఈదురు గాలులతో సభా ప్రాంగణం జలమయం
రేపు హైదరాబాద్ శిల్పకళా వేదిక నుండి రైతు భరోసా నిధులు విడుదల
అన్ని రైతు వేదికల నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడనున్న సీఎం

**మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురం జరగబోయే రైతు ఆశీర్వాద సభ రద్దు.**




**సికే న్యూస్ ప్రతినిధి ఖమ్మం :** ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురం గ్రామంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ఆశీర్వాద సభ వేదిక వద్ద నుండి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు... ఈ వర్షాల కారణంగా వాతావరణం అనుకూలించక సభను వారం రోజులు వాయిదా వేయడం జరిగింది.ఈ సభ నుంచి రైతు భరోసా నిధులను విడుదల చేయాల్సి ఉండగా వాతావరణ పరిస్థితుల వల్ల ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ శిల్పకళా వేదిక నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మాట్లాడుతూ యధావిధిగా రేపు రైతు భరోసా నిధులను రైతుల ఖాతాలలోకి రేపు జమ చేయడం జరుగుతుంది. జగన్నాధపురం లో జరిగే సభ వాతావరణం అనుకూలించాక వారం రోజుల్లో యధావిధిగా బహిరంగ సభ ఉంటుంది కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పరిస్థితులను అర్థం చేసుకొని సహకరించవలసిందిగా కోరుతున్నాము....

# బాలల సంరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: ఎస్పీ రోహిత్ రాజు.

- ఆపరేషన్ ముస్కాన్ -12 పోస్టర్ల ఆవిష్కరణ.. జులై 1 నుంచి నెల రోజుల ప్రత్యేక కార్యక్రమం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 29,** బాలల సంరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, తప్పిపోయిన చిన్నారుల గుర్తింపు కోసం నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్-12 కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన సమన్వయ సమావేశం లో ఎస్పీ ఆపరేషన్ ముస్కాన్-12 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 12 సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాల ద్వారా తప్పిపోయిన పిల్లలు, భిక్షాటనకు గురవుతున్న చిన్నారులు, నిరాశ్రయులు, బాల కార్మికులను గుర్తించి సంరక్షించి వారి కుటుంబాలకు అప్పగిస్తున్నట్లు తెలిపారు.
ఈ ఏడాది ఆపరేషన్ ముస్కాన్-12 కార్యక్రమాన్ని జులై 1 నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమం విజయవంతానికి యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, మహిళా-శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్ హెల్ప్‌లైన్-- 1098, విద్య, వైద్య, కార్మిక శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
జిల్లాలో 18 ఏళ్లలోపు పిల్లలను హింసించడం, భిక్షాటన చేయించడం, బాల కార్మికులుగా వినియోగించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో డీసీఆర్బీ డీఎస్పీ మల్లేష్ స్వామి, జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా, డీసీపీవో హరికుమారి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ రాము, అసిస్టెంట్ లేబర్ అధికారులు నాగరాజు, శాస్త్రి, ఏసుపాదం, విద్యాశాఖ జిల్లా కోఆర్డినేటర్ సైదులు, కేఎస్‌సీఎఫ్ కోఆర్డినేటర్ రాజేష్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, ఎస్ఐలు రమాదేవి, రాంబాబు, రామ్మూర్తి, రావూఫ్, వెంకన్న, సారంగపాణి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణకు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపును అడ్డుకోవాలి: సీపీఐ(ఎం) రాష్ట్ర సీనియర్ నాయకులు పోన్నం వెంకటేశ్వరరావు
- ప్రజా ఉద్యమాల ద్వారానే సామాజిక మార్పు సాధ్యం: వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం






**సి కే న్యూస్ ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు జూన్ 29 2026:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో జరుగుతున్న ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల హక్కులు దెబ్బతినకుండా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర సీనియర్ నాయకులు పోన్నం వెంకటేశ్వరరావు అన్నారు. వైరా డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఏన్కూరు మండలం తిమ్మరావుపేటలోని మోతుకూరి గార్డెన్స్‌లో నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతుల మూడో రోజు కార్యక్రమంలో ఆయన "పార్టీ నిర్మాణం -- పని పద్ధతులు" అంశంపై మాట్లాడారు.
ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఓటరు జాబితాల సవరణ పేరుతో పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించబడిన ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా బూత్ స్థాయి కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఓటరు పేరు జాబితాలో కొనసాగేందుకు అవసరమైన దరఖాస్తులు అందించి, ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, దానిని కాపాడటం ప్రతి కార్యకర్త బాధ్యత అని స్పష్టం చేశారు.
కేంద్ర ప్రభుత్వం ప్రజలను మత, కులాల పేరుతో విభజించే రాజకీయాలను ప్రోత్సహిస్తోందని విమర్శించిన ఆయన, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం కూడా వేగం పెంచాలని సూచించారు. గ్రామాల్లో సంక్షేమ పథకాల అమలును పరిశీలించి, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం అందేలా ఉద్యమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.
అనంతరం జరిగిన పార్టీ ప్లీనంలో "పార్టీ కర్తవ్యాలు" అంశంపై వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రసంగించారు. సమాజంలో అసమానతలు, పేదరికం, దోపిడీని ఎదుర్కోవాలంటే ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు, రైతులు, బడుగు బలహీన వర్గాల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లి పోరాటాల ద్వారా పరిష్కారం సాధించాలని సూచించారు.
రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల సంరక్షణ, ఓటు హక్కు కాపాడటం వంటి అంశాల్లో ప్రతి పార్టీ కార్యకర్త చైతన్యవంతంగా ఉండాలని ఆయన అన్నారు. ఓటరు జాబితాల పరిశీలనలో చురుకుగా పాల్గొని ఒక్క అర్హుడి పేరు కూడా తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.
రాజకీయ శిక్షణా తరగతులకు పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దుగ్గి కృష్ణ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదినేని, జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శులు దొంతెబోయిన నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు, కుందనపల్లి నరేంద్ర, అంబటి శ్రీనివాసరెడ్డి, నాయకులు ఏల్పుల రాములు, ఇటికల లెనిన్, కాలసాని సాయి, రేగళ్ల తిరుమలరావు, షేక్ జానీ, కాట్రేల బిక్షం, భూక్యా లచ్చు, డివిజన్, మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.



ఎమ్మెల్యే కడియం శ్రీహరి.

**సి కె న్యూస్ జూన్ 29 సోమవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్** .ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మసాగర్ మండలానికి సంబందించిన 26మంది కల్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ లబ్ధిదారులకు 26లక్షల 03వేల 016రూపాయల విలువగల చెక్కులను అలాగే 39మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 14లక్షల 25వేల రూపాయల విలువగల చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణి చేశారు. ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన భూక్య వసంత అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం 2లక్షల 50వేల రూపాయల ఎల్ఓసి ని మంజూరు చేయించి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే ముప్పారం గ్రామంలో రెండు అంగన్వాడీ భవనాల నిర్మాణానికి మంజూరు పత్రాన్ని స్థానిక సర్పంచ్ కి అందజేశారు.
అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి పథకం ఒక గొప్ప పథకం అని అన్నారు. పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు కళ్యాణ లక్ష్మి పథకం కొంత ఆర్థిక వెసులుబాటును కల్పిస్తున్నదని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదని అన్నారు. ఇంట్లో ఆడపిల్ల పెళ్లి చేయాలి అంటే తల్లిదండ్రులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, కానీ ఇవాళ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఒక లక్ష 116 రూపాయలు ఎంతో భరోసా ఇస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ రెండు సంవత్సరాల కాలంలో రైతు సంక్షేమపైన, మహిళా సంక్షేమం పైన ప్రత్యేకించి పేద వర్గాల సంక్షేమం పైన దృష్టి పెట్టి కొత్తగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందని అన్నారు. అందులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం ద్వారా ప్రతీ ఇంటికి 200యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ షాపుల ద్వారా పేద వర్గాలకు సన్నబియ్యాన్ని పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.
రాష్ట్ర ప్రభుత్వం పైన అప్పుల భారం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి పేద వర్గాల సంక్షేమనికి, సంక్షేమ పథకాల అమలుకు పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. లబ్ధిదారులు పెళ్లి జరిగిన వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న 3 నెలలలో ప్రాసెస్ పూర్తి అయ్యే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో గాని, కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల విషయంలో గాని, సీఎంఆర్ఎఫ్ విషయంలో గానీ, ఇతర ప్రభుత్వ పథకాల విషయంలో గాని ఎవరు కూడా ఒక్క రూపాయి వేరే వారికి ఇవ్వవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. మీకు రావలసిన ప్రభుత్వ పథకాలు మీ ఇంటికే వస్తాయని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు నిజాయితీగా పని చేయాలని సూచించారు. నిజాయితీగా లేని అధికారులను నేను సహించనని హెచ్చరించారు. ఏ ప్రభుత్వ పథకం అయిన ప్రభుత్వ పథకం అయిన అర్హులైన నిరుపేద ప్రజలకే అందాలని ఆ దిశగా మన తీరు ఉండాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపిడివో, వివిధ గ్రామాల సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ క్యాతంపల్లి నూతన గ్రామ కమిటీ ఎన్నిక.



**సీకే న్యూస్ జూన్ 29 సోమవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:** గో "టు విలేజ్ కార్యక్రమంలో భాగంగా
ఎమ్మార్పీఎస్ , ఎంఎస్పి వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు
ధర్మసాగర్ మండల కేంద్రంలోని క్యాతంపల్లి గ్రామంలో ఎం ఎస్ పి జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో
ఎమ్మార్పిఎస్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన గ్రామ కమిటి
ఎమ్మార్పిఎస్ గ్రామ గౌరవ అధ్యక్షులు కుర్సపెల్లి కొమురయ్య మాదిగ గంగారపు కరుణాకర్ మాదిగ
గంగారపు వెంకటస్వామి మాదిగ అధ్యక్షులు ,శిక ప్రభాస్ మాదిగ, అధికార ప్రతినిధి , కుర్సపెల్లి విజయకుమార్ మాదిగ, ఉపాధ్యక్షులు , కుర్సపెల్లి తీయోపిలాస్ మాదిగ, ఉపాధ్యక్షులు కొలిపాక రాజు మాదిగ ప్రధాన కార్యదర్శి గంగారపు ప్రభుదాస్ మాదిగ, ప్రచారకార్యదర్శి , గంగారపు అశ్విత్ మాదిగ, కార్యదర్శి, గంగారపు గంగారపు దీపక్ మాదిగ సహాయ కార్యదర్శి కుర్సపెల్లి ప్రమోదు మాదిగ
కమిటి మెంబర్లు గంగారపు ఎల్లాస్వామి మాదిగ కుర్సపెల్లి రాజు మాదిగ, కురుసపల్లి ప్రశాంత్ మాది, గంగారపు శీను మాదిగ,కుర్సపెల్లి జీవన్ మాదిగ, కుర్సపెల్లి రాజు మాదిగ, గంగారపు శంకర్ మాదిగ, తదితరులను ఎన్నుకోవడం జరిగినది,

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సుందరపు.





**అచ్యుతాపురం సి కె న్యూస్ జూన్ 29:** మండలంలో గత ప్రభుత్వ హయాంలో శిథిలావస్థకు చేరుకున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ భవనాన్ని ప్రభుత్వం నిధులతో పునరుద్ధరించి ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేశారు.
ఈ పునరుద్ధరించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా
విజయ్ కుమార్ మాట్లాడుతూ వైసీపీ నేతలు మాజీ మంత్రి అంబటి రాంబాబు, పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పై విమర్శలు చేసారు. ఆంబోతు రాంబాబు కి నోరు వేసుకొని పడడం తప్ప మరి ఏమీ చేతకాదన్నారు. మాజీ మంత్రి పేర్ని నాని తండ్రికి చరిత్ర ఉంది, తండ్రి చరిత్ర గురించి చెప్పుకుంటే పేర్ని నానికి హుందాగా ఉంటుందన్నారు.
అంబటి రాంబాబు, పేర్ని నానీలు కాపుల చరిత్ర గురించి మాట్లాడితే బాగుంటుంది. కాపు కులంలో కూడా దిగ్గజాలు ఉన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై కరణం ధర్మశ్రీ వెకిలి మాటలు మానుకోవాలి. మరోసారి పవన్ కళ్యాణ్ పై వ్యాఖ్యలు చేస్తే ఊరుకున్నది లేదు అని హెచ్చరించారు. ప్రజలకు మరింత చేరువగా ఉండి వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ క్యాంపు కార్యాలయం ఉపయోగపడుతుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే అచ్యుతాపురం మండల ప్రజలు తమ సమస్యలు, వినతులను ఈ క్యాంపు కార్యాలయం ద్వారా నేరుగా తెలియజేయవచ్చని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కార్యాలయం పనిచేస్తుందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు: జిల్లా కలెక్టర్ అంకిత్.

## ములకలపల్లిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 29,** జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ములకలపల్లి మండలంలో పర్యటించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంతో పాటు ములకలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

మొదట ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలు పంపిణీ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరికి ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని బీఎల్‌వోలకు సూచించారు. ఫారాల పంపిణీ సందర్భంగా ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లే సమయంలో ప్రతి కుటుంబాన్ని తప్పనిసరిగా కలుసుకుని అవసరమైన వివరాలను నమోదు చేయాలని, ఏ ఒక్క అర్హుడూ మిగిలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఓటరు జాబితా సవరణను పూర్తిస్థాయి పారదర్శకతతో, భారత ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు పరిశీలించి అర్హులైన వారి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలు కూడా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ వివరాలను పరిశీలించుకుని అవసరమైన ఫారాలను గడువులోపు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.

అనంతరం ములకలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న చికిత్స విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇన్‌పేషెంట్ వార్డు, ఔట్‌పేషెంట్ వార్డు, ప్రసూతి గది, రక్త పరీక్షల గది, ఫార్మసీ, ఔషధ నిల్వ కేంద్రం, ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

ఆసుపత్రికి రోజువారీగా వచ్చే ఔట్‌పేషెంట్ల సంఖ్య, చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్ల సంఖ్య, నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, ఇతర నిర్ధారణ పరీక్షల వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా, ఔషధ నిల్వలు ఎంత మేరకు ఉన్నాయో పరిశీలించారు. అవసరమైన మందులు, పరీక్షా సామగ్రి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు, పరీక్షా కిట్లు, వైద్య సామగ్రిని తగినంతగా నిల్వ ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.

ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలు, సురక్షితమైన తాగునీటి వినియోగంపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు, పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ స్వాతి బిందు, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, వైద్యాధికారి డాక్టర్ సాయి కళ్యాణ్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీకృష్ణ, మెడికల్ సిబ్బంది ఇమ్రాన్, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ ఆదర్శప్రాయులు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం.

- అందరి సహకారంతోనే అభివృద్ధి : రాహుల్.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 29,** ఒక అధికారి ప్రజా సేవను తన శ్వాసగా భావిస్తే ఆ ప్రాంతం ఎలా మారుతుందో చెప్పడానికి భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ ప్రత్యక్ష నిదర్శనం అని శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రశంసించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ హాల్లో నిర్వహించిన ఐటీడీఏ పీవో రాహుల్ రెండేళ్ల పాలన సక్సెస్ మీటిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

గత రెండేళ్లలో ఆయన తన కార్యక్షేత్రంలో సృష్టించిన విప్లవాత్మక మార్పులు, వెనుకబడిన గిరిజన ప్రాంతాల్లో నూతన ఆశలను చిగురింపజేశాయి అన్నారు.పరిపాలన అంటే కేవలం ఫైళ్లకు పరిమితం కాదని, అది అట్టడుగు వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఒక సాధనమని పిఓ రాహుల్ నిరూపించారన్నారు. గిరిజన సంస్కృతికి పట్టం కడుతూనే, ఆధునిక విద్య మరియు ఉపాధి రంగాల్లో మన గిరిజన విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా ఆయన చేసిన కృషి అనన్యం అన్నారు.విద్య, వైద్యం, వసతి, క్రీడలు మరియు సంస్కృతి అనే ఐదు ప్రధాన సూత్రాలతో ఆయన నిర్మించిన 'గిరిజన వికాస సౌధం' నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందటం తనకెంతో గర్వకారణంగా ఉందన్నారు. ఆదివాసీల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ఈ ప్రజా బాంధవుడి ప్రస్థానం, భావి తరాలకు ఒక స్ఫూర్తిదాయక పాఠం అని అభినందించారు

**అందరి సహకారంతోనే సక్సెస్ : పిఓ రాహుల్**

అందరి సహకారంతోనే భద్రాచలం ఐటీడీఏని ముందుకు తీసుకు వెళ్ళటం జరిగిందని ఐటీడీఏ పీవో బి. రాహుల్ వెల్లడించారు. ప్రధానంగా జిల్లా శాసనసభ్యులు కూడా ఎంతగానో సహకరించారని తెలిపారు. యూనిట్ అధికారులు కూడా బాధ్యతాయుతంగా పనిచేశారని ప్రశంసించారు. ఐటీడీఏ లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు గిరిజన అభివృద్ధిలో చేయి చేయి కలిపారని తెలిపారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు 'ఉద్దీపకం' కార్యక్రమాన్ని అమలు చేశామన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఇంగ్లీష్, అర్థమెటిక్, తెలుగు భాషలపై పట్టు సాధించేలా ప్రత్యేక పుస్తకాలను రూపొందించడం వల్ల, ఏకంగా 90% మంది విద్యార్థులు అద్భుతమైన ఫలితాలను సాధించారన్నారు.విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యాలను తీర్చిదిద్దేందుకు కెరీర్ అవేర్ నెస్ ఫ్లెక్సీలను విద్యాసంస్థల్లో ఏర్పాటు చేయగా అవి ఎంతగానో సక్సెస్ ఇచ్చాయని పేర్కొన్నారు.క్రీడల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తూ వారిని ప్రోత్సహించటం జరిగిందని సత్ఫలితాలు పాజిటివ్ గా వచ్చాయన్నారు.గిరిజన మ్యూజియంను ఆధునీకరించి, 1.5 లక్షల మంది సందర్శకులను ఆకర్షించేలా తీర్చిదిద్దడమే కాకుండా, 'తెలంగాణ రాష్ట్ర గ్రామీణ పర్యాటక పురస్కారాన్ని' ఢిల్లీ నుంచి రూ. 1 కోటి నిధులను అందుకోవటం సంతోషాన్ని ఇచ్చింది అన్నారు.

గిరిజన ఇలవేల్పుల చరిత్రను తెలిపే పుస్తకాన్ని వెలుగులోకి తేవటం కూడా సంతోషకరమన్నారు. గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తూ ప్రారంభించిన 'భద్రగిరి మార్ట్', నేడు గిరిజన కుటుంబాలకు ఆర్థిక భరోసానిచ్చే ప్రధాన వేదికగా మారిందన్నారు

భద్రాచలం శాసనసభ్యులు ఐటీడీఏ యూనిట్ అధికారులు సిబ్బంది సమక్షంలో ఐటీడీఏ పీవో సాధించిన ప్రగతి పోస్టర్ ఆవిష్కరించారు.

అందరి సమక్షంలో రెండు సంవత్సరాలు పూర్తి చేసినందున కేక్ కట్ చేసి ఐటిడిఏ పీఓకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, భద్రాచలం సర్పంచ్ పూణేమ్ కృష్ణ మరియు ఇతర శాఖల యూనిటీ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**మాజీ మండల పార్టీ అధ్యక్షులు గుగులోతు కృష్ణ నాయక్**



**గరిడేపల్లి సీకే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** మండలం పరిధిలో ఉన్న సోమలతండ గ్రామకి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు చెన్ను నాయక్ కుమారుడుగుగులోతు సైదా నాయక్ మరియు పార్వతి ని ఆశీర్వదించిన గరిడేపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు గుగులోతుకృష్ణ నాయక్ మరియు కల్మలచెరువు మాజీ సర్పంచ్ జమ్ము మగ్తా నాయక్ నూతన వధూవరులను ఆశీర్వదించి వారి కుటుంబ సభ్యులను ఆనందింప చేశారు అదేవిధంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులతో కలిసి ఇందు భోజనం చేశారు గ్రామ శాఖ అధ్యక్షులు గుగులోతు రాంబాబు నాయక్ మాజీ వార్డ్ నెంబర్లునాగేందర్ నాయక్ కాంతా ఫుల్ సింగ్ నాయక్ మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు శంకర్ నాయక్ పాండు నాయక్ సుక్యా నాయక్ నాగేశ్వరావు నాయక్ బాలు నాయక్
నాగరాజు నాయక్ సోమ్లా నాయక్ రవీందర్ నాయక్
భుక్య నరసింహ
కమల్ నాయక్ వివిధ బిఆర్ఎస్ పార్టీ నాయకులు యువకులు పాల్గొన్నారు

# ప్రజలకు నిర్విరామంగా సేవలందించిన ఉద్యోగుల సేవలు చిరస్మరణీయం.



జిల్లా కలెక్టర్ అంకిత్.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 29,** ప్రజలకు సుదీర్ఘకాలం పాటు అంకితభావంతో, నిబద్ధతతో సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగుల సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో పదవీ విరమణ పొందుతున్న కె. సంజీవరావు (సీపీఓ), డాక్టర్ వెంకటేశ్వర్లు (డీవీఏహెచ్ఓ), చి. రమేష్‌బాబు (అసిస్టెంట్ ఇంజనీర్, హౌసింగ్), అంజనేయులు (ఆఫీస్ సబార్డినేట్, హౌసింగ్ శాఖ)లకు ఏర్పాటు చేసిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, పదవీ విరమణ అనేది ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగం పొందిన నాటి నుంచి ఉద్యోగికి సమాజంలో ఒక ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని, విధి నిర్వహణలో సంపాదించిన అనుభవం, ప్రజల ఆదరణ జీవితాంతం వెంట ఉంటాయని అన్నారు.

30 నుంచి 40 సంవత్సరాల పాటు ప్రభుత్వ సేవలో ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయడం గొప్ప విషయమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి తనవంతు కృషి చేయడం అభినందనీయమని చెప్పారు. పదవీ విరమణతో ఉద్యోగ జీవితం ముగిసినప్పటికీ, సమాజానికి సేవ చేసే అవకాశాలు ఎన్నో ఉంటాయని, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ అనుభవాలను, విలువైన సూచనలను ప్రస్తుత ఉద్యోగులతో పంచుకోవడం ద్వారా వారికి మార్గదర్శకులుగా నిలవాలని కలెక్టర్ సూచించారు.

ప్రభుత్వ సేవలో క్రమశిక్షణ, నిజాయితీ, బాధ్యతాయుత విధి నిర్వహణతో ప్రజల విశ్వాసాన్ని సంపాదించడం ఉద్యోగ జీవితంలో అత్యంత గొప్ప విజయమని కలెక్టర్ అన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ, ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌లు పదవీ విరమణ పొందిన ఉద్యోగులను శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ ఉద్యోగ జీవితంలోని అనుభవాలను పంచుకుంటూ, తమకు సహకరించిన జిల్లా యంత్రాంగం, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పట్టాపాస్ బుక్ పట్టాదార్ రైతు భరోసాకు అప్లైచేసుకోవాలి,

**వ్యవసాయ అధికారి హరిప్రసాద్**



**జూన్ 29 (సీ కే న్యూస్) చేగుంట**

చేగుంట మండల ప్రజలు కొత్తగా పట్టాదార్ పాస్ బుక్ వచ్చిన రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం హరిప్రసాద్ తెలిపారు. రైతు భరోసా దరఖాస్తు చేసుకోవడానికి పట్టాదారు పాస్ బుక్ ఆధార్ కార్డు మరియు బ్యాంకు ఖాతా సంఖ్యకు సంబంధించిన జిరాక్స్ కాపీలను సంబంధించిన జిరాక్స్ కాపీలను వ్యవసాయ విస్తరణ అధికారులకు ఇవ్వగలరని వారు కోరారు. దరఖాస్తు చేసుకోవడానికి జులై 5 వ తేదీ చివరి రోజు కనుక రైతు సోదరులు దరఖాస్తు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# నానో ఎరువుల నానో యూరియా నానో డి.ఎ.పి పై అవగాహన కార్యక్రమం

- కే.వి.కే-గడ్డిపల్లి శాస్త్రవేత్త హెడ్ ఇన్చార్జ్ నరేష్.

**సీకే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు.** మండలంలోని పరిధిలో ఉన్న గారకుంట తండాలో గ్రామంలో సోమవారం నాడు ఖేత్ బచావో అభియాన్" (నేలలను రక్షించుకుందాం) కార్యక్రమంలో భాగంగా నానో ఎరువుల వాడకంపై అవగాహన కల్పించినట్లు కే.వి. కే గడ్డిపల్లి సీనియర్ శాస్త్రవేత్త అండ్ హెడ్ ఇంచార్జ్ డి.నరేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ భూసారాన్ని కాపాడటానికి, సంప్రదాయ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి నానో ఎరువులు వాడాలి అన్నారు.అధికంగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం తగ్గిపోతోంది. వీటి వాడకాన్ని తగ్గించి, ప్రతి రైతు తన భూసార పరీక్షలు చేయించుకొని, భూమికి అవసరమైన పోషకాలను, దీని ద్వారా సాగు ఖర్చులు తగ్గుతాయి.సుస్థిర వ్యవసాయం వాతావరణ మార్పులను తట్టుకుంటూ, ఎక్కువ దిగుబడి సాధించే ఆధునిక, పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులపై అవగాహన ఇచ్చారు.




అదేవిధంగా గ్రామంలో రెండు నెలల పాటు నేర్చుకున్న ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా శిక్షణ ముగింపు సందర్భంగా టైలరింగ్ నేర్చుకున్న మహిళలకు సర్టిఫికెట్లు ఇచ్చి ప్రత్యేకంగా అభినందించారు మహిళల ఆధ్వర్యంలో అతిధులకు ప్రత్యేకంగా సన్మానం చేసి మేమెంటు అందజేశారు ఈ కార్యక్రమంలో గడ్డిపల్లి కే వి కే గడ్డిపల్లి శాస్త్రవేత్త ఎ.కిరణ్, ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఎన్. సుగంధి, ఇఫ్కో మేనేజర్ ఎ.వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ బానోతు అరుణ రమేష్ ఉపసర్పంచ్ గౌతమి సుధాకర్ నీల హేమ్లా నాయక్, నరేందర్ నాయక్ సందీప్ నాయక్ బాలు నాయక్ కోటయ్య ఆర్ఎంపీ డాక్టర్ రంగా నాయక్ శ్రీను నందా మహిళలు టైలరింగ్ మహిళలు శారద భవాని కళ్యాణి కైక సత్యవతి పరమేశ్వరి సరిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏరువాక పౌర్ణమి రైతు దినోత్సవ వేడుకలు

- గ్రామ సామాజిక సేవాకర్త ధరావత్ నరసింహ



**చింతలపాలెం సీకే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** చింతలపాలెం మండల పరిధిలో ఉన్న ఎర్రకుంట తండా గ్రామంలో వైభవంగా రైతులు ఏరువాక పౌర్ణమి రైతు దినోత్సవ వేడుకలు రైతులు గ్రామ మహిళలతో కలిసి ఘనంగా నిర్వహించారు నేటితో రైతులు పనిరోజులు మొదలవుతాయని గ్రామానికి చెందిన ధరావత్ సోముల తన వ్యవసాయ పొలంలో ఎద్దులతో నాగలి కట్టి రైతులకు ఏరువాక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సామాజిక సేవాకర్త ధరావత్ నరసింహ తదితరులు పాల్గొన్నారు

# దేశ సేవకు ఎన్నికైన యువకుడిని అభినందించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్




**సీకే న్యూస్ ప్రతినిధి** బోథ్ మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు మెడిచేల్మా ప్రవీణ్ బావమరిది మెడిచేల్మా వంశీ ఇటీవల వెలువడిన నేవి ఫలితాల్లో ఉద్యోగం సాధించినందుకు ఈరోజు బోథ్ మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ యువకుడిని సన్మానించి అభినందించారు. గ్రామాల నుంచి దేశ సేవకు వెళు న్నందుకు గర్వపడాలని, ఇతర యువతకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు స్వామి, సర్పంచ్ రూప్చంద్, రవీందర్ జాదవ్, కృష్ణ నాయక్, నాయకులు ఎలుక రాజు, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, రాము, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి చరిత్రలో తొలిసారిగా అధికారుల రిలే నిరాహార దీక్షలు.

పే అప్‌గ్రేడేషన్, పీఆర్‌పీ సహా పెండింగ్ డిమాండ్ల పరిష్కారానికి ఆందోళన ఉధృతి.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 29,** సింగరేణి సంస్థ చరిత్రలో తొలిసారిగా అధికారులు రిలే నిరాహార దీక్షలకు దిగారు. పే అప్‌గ్రేడేషన్, పీఆర్‌పీ (పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే)తో పాటు ఇతర పెండింగ్ డిమాండ్ల పరిష్కారాన్ని కోరుతూ కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంఓఏఐ) సింగరేణి శాఖ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేశారు.

ఇప్పటికే జూన్ 17, 19, 22 తేదీల్లో భారీ ర్యాలీలు, మహాధర్నాలు నిర్వహించిన అధికారులు ప్రతిరోజూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతూ, అనంతరం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కోల్ ఇండియా అధికారులకు అమలవుతున్న పే అప్‌గ్రేడేషన్, పీఆర్‌పీతో పాటు అన్ని సౌకర్యాలను సింగరేణి అధికారులకు కూడా వర్తింపజేయాలని నినాదాలు చేశారు.

అయితే, ఇప్పటివరకు యాజమాన్యం లేదా ప్రభుత్వ స్థాయిలో ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో అధికారుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో తమ సమస్యలు, ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణను ప్రజలకు తెలియజేస్తూ మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సోమవారం నుంచి సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుటతో పాటు అన్ని ఏరియాల జనరల్ మేనేజర్ (జీఎం) కార్యాలయాల ముందు రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తున్నట్లు అధికారుల సంఘం ప్రకటించింది. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేసింది.

# మహాజన నేత ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ గారిని కలసిన

యాదాద్రి భువనగిరి జిల్లా దండోరా ప్రధాన నాయకత్వం




**సి కె న్యూస్ ఆత్మకూరు యం రిపోర్టర్ షేక్ అజీజ్ :** జూలై 7 న ఎమ్మార్పియస్ 32 వ ఆవిర్భావ వేడుకలు యాదాద్రి భువనగిరి జిల్లా లో ఘనంగా నిర్వహించాలని నాయకత్వానికి పిలుపునిచ్చిన మంద కృష్ణ మాదిగ గారు

ఎమ్మార్పియస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ గారిని హైదరాబాద్ లో వారి నివాసంలో యాదాద్రి భువనగిరి జిల్లా దండోరా ప్రధాన నాయకత్వం మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.జిల్లా లోఅమలు జరుగుతున్న ఉద్యమ కార్యాచరణ, పలు అంశాల పై వివరించడం జరిగింది.ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ గారు మాట్లాడుతూ జూలై 7 న ఎమ్మార్పియస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు యాదాద్రి భువనగిరి జిల్లా లోని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

మంద కృష్ణ మాదిగను కలసిన వారిలో

- ఎంఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ ఇంజ వెంకటస్వామి మాదిగ,
- ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ,
- ఎమ్మార్పియస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ,
- ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద శంకర్ మాదిగ,
- ఎమ్మార్పియస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ తదితరులు ఉన్నారు..

సామాజిక ఉద్యమ నమస్సులతో...

- నల్ల చంద్ర స్వామి మాదిగ
- ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు

# భావన ఋషి చేనేత సహకార సంఘానికి నూతన పాలకవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని : పాతర్లపాడు గ్రామంలోని శ్రీ భావన ఋషి చేనేత సహకార పారిశ్రామిక ఉత్పత్తి మరియు విక్రయ కేంద్రం నూతన పాలకవర్గ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడ్డాయి. ఎన్నికల అధికారి పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నూతన అధ్యక్షుడిగా కాటబత్తిని వెంకట నరసయ్య, కార్యదర్శిగా గుగ్గిళ్ళ రామారావు, ఉపాధ్యక్షుడిగా పిల్లలమరి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

డైరెక్టర్లుగా సంగిశెట్టి సత్యనారాయణ (కోశాధికారి), కోరుట్ల వెంకటేశ్వర్లు, గుడ్ల శ్రీనివాసరావు, పెంటి బక్కయ్య, గుగ్గిళ్ళ మంగమ్మ, మిడిదొడ్ల నాగమణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, సంఘం అభివృద్ధి, ఉత్పత్తుల పెంపు, మార్కెటింగ్ సౌకర్యాల విస్తరణకు సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు.

గ్రామ పెద్దలు, చేనేత కార్మికులు నూతన పాలకవర్గ సభ్యులను అభినందిస్తూ, సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు.

# ప్రజల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం.. 7వ వార్డులో నూతన కల్వర్టు బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకొచ్చిన సర్పంచ్ నారగాని రాంబాయి



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో నాగులవంచ గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి--శ్రీనివాసరావు మరో ముందడుగు వేశారు. గ్రామంలోని 7వ వార్డులో కొంతకాలంగా ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కల్వర్టు బ్రిడ్జి సమస్యను గుర్తించి, వెంటనే స్పందించి నూతన కల్వర్టు బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టించారు.

వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని నాణ్యతా ప్రమాణాలతో బ్రిడ్జిని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో స్థానిక ప్రజలు, రైతులు, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా రాకపోకలు సాగించే అవకాశం కలిగింది.

ఈ సందర్భంగా సర్పంచ్ నారగాని రాంబాయి మాట్లాడుతూ, గ్రామ ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన బాధ్యత అని, గ్రామంలో అవసరమైన ప్రతి అభివృద్ధి పనిని దశలవారీగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.గ్రామ ప్రజలు సర్పంచ్ నారగాని రాంబాయి తీసుకున్న చొరవను అభినందిస్తూ, ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడం హర్షణీయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో... నాగులవంచ శ్రీ గజగిరి లక్ష్మీనరసింహస్వామి మరియు కోదండరామస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ ముత్తినేని వెంకటేశ్వర్లు, మాజీ దేవలయ కమిటీ చైర్మన్ నారగాని శ్రీనివాసరావు, ఏడో వార్డు సభ్యులు అనగాని జానకి – శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు ఏసు గోపయ్య, యేసు లక్ష్మయ్య, కందిమల్ల కాశయ్య, పడిశాల దినేష్, నరేష్, చల్లా నాగరాజు, తురక రమేష్,వేంకటేష్, గుడ్డేటి నాగేశ్వరావు వార్డు ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# ఏరువాక పౌర్ణమి వేడుకల్లో సుంకులమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు:



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :**ఏరువాక పౌర్ణమి సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని శ్రీ సుంకులమ్మ అమ్మవారి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. గద్వాల పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ మొక్కుబడులను చెల్లించుకుంటూ అమ్మవారి ఆశీస్సులు పొందారు.

ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించగా, ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సుంకులమ్మ అమ్మవారి దివ్యరూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక వాతావరణం భక్తులకు కనువిందు చేశాయి.

ఆలయ ప్రాంగణం ఉదయం నుంచే భక్తజన సందోహంతో కళకళలాడగా, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. పట్టణ ప్రజలు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి తమ కుటుంబాల సుఖశాంతులు, పంటల సమృద్ధి కోసం ప్రార్థనలు చేశారు.

ఏరువాక పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలు గద్వాల ప్రాంతంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపగా, సుంకులమ్మ అమ్మవారి ఆలయం భక్తులతో సందడిగా మారింది.

# ఏరువాక పౌర్ణమి సందర్భంగా నూతన గిరకబండి పూజా కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి



**సీకే న్యూస్ ప్రతినిధి గద్వాల**

బాసు హనుమంతు నాయుడు గారు

ఈరోజు గద్వాల నియోజకవర్గం గట్టు మండలం బల్గెర గ్రామంలో శ్రీశ్రీశ్రీ దిగంబర స్వామి దేవస్థాన ఆవరణలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా నూతన గిరికబండి పూజా కార్యక్రమంలో పాల్గొని,కొబ్బరికాయ కొట్టి, ప్రారంభించారు.....

ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ఒ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు...

# జాతీయ కిక్‌బాక్సింగ్‌లో పతకాల పంట.. తెలంగాణ క్రీడాకారులకు స్పోర్ట్స్ అథారిటీ ఎండీ డా. ఏ. సోని బాలాదేవి అభినందనలు



**సికే న్యూస్ ప్రతినిది హైదరాబాద్:**

మధ్యప్రదేశ్‌లో ఇటీవల నిర్వహించిన సబ్–జూనియర్ జాతీయ కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన చిన్నారులు అద్భుత ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి ఘనత తీసుకొచ్చారు. మొత్తం 27 పతకాలు సాధించి తమ సత్తా చాటారు. వీటిలో 4 స్వర్ణ, 4 రజత, 19 కాంస్య పతకాలు ఉన్నాయి.

స్వర్ణ పతక విజేతలు:
గొలుసుల మేఘాంశ్ -- 21 కేజీలు (పి ఎఫ్)
సోయినిక -- 18 కేజీలు (పి ఎఫ్)
వరుణ్ సైనీ -- 24 కేజీలు (పి ఎఫ్)
చాగల పవని -- 46 కేజీలు (కె ఎల్)

రజత పతక విజేతలు:
చామర్తి హాసిని -- 65 కేజీలు (కె ఎల్)
మజ్జిగ మానస్వి -- 32 కేజీలు (పి ఎఫ్)

కాంస్య పతక విజేతలు:
చామర్తి తేజస్య -- 42 కేజీలు (ఎల్ సి)
పూజారి హారిక -- 42 కేజీలు (కె ఎల్)
పవిత్ర బూర్ల -- 42 కేజీలు (కె ఎల్)
రావుల యశశ్రీ -- 60 కేజీలు (కె ఎల్)
ఎ. అర్షిత్ -- 37 కేజీలు (పి ఎఫ్)

ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్స్) మేనేజింగ్ డైరెక్టర్ డా. ఏ. సోని బాలాదేవి, ఐ ఎఫ్ ఎస్ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి తెలంగాణకు కీర్తి తెచ్చిన యువ కిక్‌బాక్సర్లను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలోనూ రాష్ట్రం, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

అలాగే క్రీడాకారులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన కోచ్‌లు, తల్లిదండ్రులు, సహాయక సిబ్బంది సేవలను ఆమె ప్రత్యేకంగా ప్రశంసించారు.

ఈ అభినందన కార్యక్రమంలో తెలంగాణ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సి. రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఎన్. మహిపాల్, నర్సింగ్ రావు, ప్రవీణ్ కుమార్, మల్లేష్, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుని భౌతికకాయానికి నివాళులు అర్పించిన నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి

బాసు హనుమంతు నాయుడు గారుబి



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల** ఈరోజు గద్వాల నియోజకవర్గం గట్టు మండలం పెంచికలపాడు గ్రామంలో జేంగిటి చిన్నయ్య అనారోగ్యంతో మృతి చెందాడు...విషయం తెలుసుకొని వారి స్వగృహానికి వెళ్లి,ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి, నివాళులు అర్పించి,కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.....

వీరి వెంట,అంగడి బసవరాజ్,నూర్ పాషా, మద్దిలేటి,తిమ్మప్ప,లక్ష్మణ,కరెప్ప, నరసింహులు,వెంకటేష్,ప్రవీణ్, కృష్ణ,ఆంజనేయులు,మరియు గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు....

# మెదక్ లైఫ్ కేర్ సూపర్ స్పెషల్ టి హాస్పిటల్ సౌజన్యంతో నాయిని జలల్ పూర్ లో ఉచిత మెగా వైద్య శిబిరం




## ఉచితంగా ఈసీజీ తో పాటు, బీపీ, షుగర్ తదితర రక్తపరీక్షలు

**సీకే న్యూస్ కొల్చారం నర్సాపూర్ :**మెదక్ జిల్లా కొల్చారం మండలం జలాల్‌పూర్ లైఫ్ కేర్ సూపర్ స్పెషల్ టి మెదక్ హాస్పిటల్ వారి సౌజన్యంతో గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో కొల్చారం మండలం నాయిని జలాల్‌పూర్ గ్రామంలో ఆదివారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించి పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొని వారికీ సంబంధించిన వ్యాధులను ఈ ఉచిత మెగా వైద్య శిబిరం చూయించుకున్నారు....ఈ మెగా వైద్య శిబిరంలో లైఫ్ కేర్ మెదక్ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ వైద్యులు ఫిజీషియన్ డాక్టర్ ముజీబ్, డాక్టర్ గౌతమ్, డాక్టర్ అంజలి, డాక్టర్ జీవనజ్యోతి, డాక్టర్ చక్రవర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు..అదేవిధంగా ప్రజలకు ఉచితంగా ఈసీజీ, రక్తపోటు (బీపీ), షుగర్ పరీక్షలు మరియు ఇతర అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్యుల సూచనల మేరకు తగిన మందులు కూడా ఉచితంగా పంపిణీ చేశారు.. సామాజిక సేవ చేయాలనే సంకల్పంతో గ్రామంలో పెద్ద ఎత్తున ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గ్రామంలో ఏర్పాటు చేసినట్లు... హాస్పిటల్ ఎండి నదీమ్, మహమ్మద్ మన్సూర్ తెలిపారు....ఈ శిబిరం ద్వారా నాయిని జలాల్ పూర్ గ్రామ ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మెగా వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు వినియోగించుకున్నారు. ఈ ఉప సర్పంచ్ నాయిని వెంకట నరసింహులు వార్డు మెంబర్లు సీనియర్ నాయకులు చిన్నరాయన్న గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేత



**సీకే న్యూస్ కొల్చారం నర్సాపూర్:**మెదక్ జిల్లా కొల్చారం మండలం పైతర గ్రామంఆవుల రాజి రెడ్డి సహకారంతో కొల్చారం మండలం, పైతర గ్రామానికి చెందిన కీర్తిశేషులు పుట్టి అంజమ్మ సీఎం సహాయనిధి కుటుంబానికి 60,000 వ చెక్కును అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు అండగా నిలవాలనే దృఢ సంకల్పంతో, సొంత ఖర్చులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చెక్కును మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు

# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారిని స్వాగతం పలికిన నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి

బాసు హనుమంతు నాయుడు గారు



సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :ఈరోజు గద్వాల జిల్లాకి విచ్చేసిన దీ=ూ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారిని మరియు తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ గారిని జమ్మిచెడు దగ్గర నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు గారు,పార్టీ నాయకులతో కలిసి,పూలమాల వేసి,శాలువాతో ఘనంగా సత్కరించి,స్వాగతం పలికారు.....

ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు,కౌన్సిలర్లు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు....

# సామినేని రామారావు విగ్రహావిష్కరణ బహిరంగ సభ ను జయప్రదం చేయండి...

- మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి...



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ సామినేని రామారావు విగ్రహావిష్కరణ బహిరంగ సభ జూలై 1న పాతర్లపాడు లో జరగనున్న ఈ బహిరంగ సభ విగ్ర ఆవిష్కరణ విజయవంతం చేయాలని మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు తెలిపారు సోమవారం పాతర్లపాడు గ్రామంలో మండల కమిటీ సమావేశంలో తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి మాజీ ఎంపీ సిపిఎం జాతీయ నాయకురాలు బృందా కారత్ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు జిల్లా పార్టీ కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మధుర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ బాధ్యులు శాఖ సెక్రెటరీలో పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది.

- భద్రాచలం ఎమ్మెల్యే డా. వెంకట్రావు.
- ఘనంగా టియుడబ్ల్యుజె (ఐజెయూ) భద్రాచలం డివిజన్ మహాసభ.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూన్ 29, సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివేళలా అండగా ఉంటుందని భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని రాఘవ నిలయం ( రెడ్డి సత్రం) నందు జరిగిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజె – ఐజెయూ) భద్రాచలం డివిజన్ మహాసభ ఆ యూనియన్ జాతీయ కౌన్సిల్ మెంబర్ బి. వి. రమణారెడ్డి,జిల్లా అధ్యక్షులు జాగు వెంకటరత్నం, కార్యదర్శి జునుమాల రమేష్ ల సమక్షంలో సభాక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన జర్నలిజం రంగంలో పనిచేస్తున్న విలేకరుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమ కార్యక్రమాల అమలుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం యూనియన్ భద్రాచలం డివిజన్ మహాసభ జరిగింది. ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష,కార్యదర్శులను ఎన్నుకున్నారు.

అధ్యక్షుడిగా ఎల్. శ్రీహరి కుమార్ ,కార్యదర్శిగా జయరాం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు, పలువురు ప్రముఖులు, భద్రాచలం డివిజన్ లోని మీడియా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు. డివిజన్ లో యూనియన్ పటిష్టతకు శక్తివంచన లేకుండా కార్యవర్గం కృషి చేయాలని సూచించారు.

# విద్యార్థుల భవిష్యత్తు విద్యపైనే -- ప్రభుత్వ స్కూలు దుస్తుల పంపిణీ,

ప్రైవేట్ స్కూలుకు దీటుగా ఉండాలి,

జూన్ 29 (సీ కే న్యూస్) చేగుంట :విద్యార్థి భవిష్యత్తు నాణ్యమైన విద్య". ఆ విద్యకు మొదటి మెట్టు స్కూలు. స్కూలుకు వెళ్లేటప్పుడు వేసుకునే యూనిఫాం ఒక్క గుడ్డ ముక్క కాదు, అది పిల్లాడి ఆత్మవిశ్వాసం.

ప్రైవేట్ స్కూల్, ప్రభుత్వ స్కూలు యూనిఫాం -- తేడా ఎందుకు వస్తుంది?లి

ప్రైవేట్ స్కూల్లో పిల్లాడు కలర్‌ఫుల్ షర్టు, మంచి ఫ్యాబ్రిక్, ఫిట్టింగ్ డ్రెస్ వేసుకొస్తాడు. ప్రభుత్వ స్కూల్ పిల్లాడికి చిన్న పెద్ద అయ్యే రెడీమేడ్ డ్రెస్, వాష్ చేస్తే రంగు వెలిసిపోయే బట్ట ఇస్తారు.

ఫలితం పిల్లాడిలో "నేను తక్కువ" అనే ఫీలింగ్. క్లాస్‌లో కూర్చున్నా సిగ్గు, ఆటల్లో ఉత్సాహం తగ్గిపోతుంది. విద్యపై శ్రద్ధ తగ్గుతుంది.

మంచి దుస్తుల పంపిణీ ఎందుకు అవసరం,

సమానత్వం బీద, ధనిక తేడా లేకుండా అందరూ ఒకేలా కనిపించాలి. మంచి యూనిఫాం ఇస్తే "ప్రభుత్వ స్కూల్ అంటే చీప్" అనే ముద్ర పోతుంది.

ఆరోగ్యంనాణ్యమైన కాటన్ బట్ట ఇస్తే వేసవిలో చెమట, చలికాలంలో వెచ్చదనం ఉంటుంది. రఫ్ బట్ట వల్ల చర్మ వ్యాధులు రావు.

హాజరు పెరుగుదల: మా స్కూల్ డ్రెస్ బాగుంది" అనే గర్వంతో పిల్లలు స్కూలుకు రెగ్యులర్‌గా వస్తారు. డ్రాపౌట్ రేట్ తగ్గుతుంది.

తల్లిదండ్రుల భారం తగ్గుతుందిలి: ఏడాదికి 2 జతల డ్రెస్ కొనాలంటే 1500-2000 రూ. అవుతుంది. ప్రభుత్వమే మంచిది ఇస్తే ఆ డబ్బు పుస్తకాలు, పెన్నులకు ఉపయోగపడుతుంది.

ప్రైవేట్ స్కూలుకు దీటుగా ఎలా ఇవ్వాలి,

ప్రభుత్వం "విద్యా కానుక" కింద ఇస్తున్నా, కొన్ని మార్పులు చేస్తే బాగుంటుంది:

| అంశం | ఇప్పుడు ఉన్నది | కావాల్సింది |
| --- | --- | --- |
| బట్ట నాణ్యత | సింథటిక్ మిక్స్, త్వరగా చిరుగుతుంది | 100% కాటన్, కలర్ స్టెడీ |
| సైజుఒకే సైజు రెడీమేడ్ | | పిల్లాడి మేజర్‌మెంట్ తీసి కుట్టించడం |
| డిజైన్ రింగ్ రంగు | | స్కూల్ లోగో, టై, బెల్ట్‌తో మోడరన్ లుక్ |
| సమయం | స్కూల్ తెరిచిన 3 నెలలకు ఇస్తారు | జూన్ 1కే కొత్త డ్రెస్‌తో స్కూల్ ప్రారంభం |

తెలంగాణలో కొన్ని జిల్లాల్లో "స్టిచింగ్ ఛార్జీలు నేరుగా తల్లిదండ్రుల ఖాతాకు" ఇచ్చే విధానం మొదలైంది. దీనివల్ల పిల్లాడి సైజుకి తగ్గట్టు స్థానిక టైలర్ దగ్గర కుట్టించుకోవచ్చు. ఇది మంచి నిర్ణయం.

విద్యార్థి భవిష్యత్తు కోసం మన బాధ్యతలి

యూనిఫాం బాగుంటే పిల్లాడు గర్వంగా స్కూలుకు వెళ్తాడు. గర్వంగా వెళ్లే పిల్లాడు శ్రద్ధగా చదువుతాడు. శ్రద్ధగా చదివే పిల్లాడి భవిష్యత్తు బంగారమవుతుంది.

ప్రభుత్వం, తల్లిదండ్రులు, సర్పంచ్, టీచర్లు కలిసి "మన స్కూల్ -- మన గౌరవం" అనే క్యాంపెయిన్ పెట్టుకోవాలి. పంపిణీలో అవినీతి లేకుండా, మంచి క్వాలిటీ టెండర్ వేయించాలి.

విద్య ఉచితంగా ఇస్తున్నాం కదా అని యూనిఫాం విషయంలో రాజీ పడకూడదు. ప్రైవేట్ స్కూలు పిల్లాడికి ఉండే గౌరవం ప్రభుత్వ స్కూలు పిల్లాడికి కూడా ఉండాలి. అప్పుడే "ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెరుగుతాయి, విద్యార్థుల భవిష్యత్తు బ్రైట్ అవుతుంది".

మీ గ్రామ వార్డులో యూనిఫాం క్వాలిటీ బాగోలేకపోతే, వీజూ కి, సర్పంచ్‌కు వినతిపత్రం ఇవ్వొచ్చు. విద్యార్థుల భవిష్యత్తు దేశానికి అవసరం,

సి కె న్యూస్ చేగుంట మండల్ రిపోటర్, కొండి శ్రీనివాస్

# మత్కేపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం





సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి .మత్కేపల్లి గ్రామంలో రొడ్డ రాజు--నాగమణి దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు గ్రామ సర్పంచి కంచం ద్రౌపది తో కలిసి ప్రారంభించారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కి రొడ్డ రాజు--నాగమణి దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి , మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున , గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంచం కోటేశ్వరరావు నాగులవంచ మాజీ సర్పంచ్ వీరభద్రం గారు, సొసైటీ డైరెక్టర్ వలమల రామారావు , కాంగ్రెస్ నాయకులు బోలకొండ రామారావు నర్సింశెట్టి చలమయ్య , సంకెళ్ల పాపారావు బండి నారాయణ అలాగే కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

# సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి.

- సంస్థను కాపాడుతున్న అధికారుల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడాలి.
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.
- అధికారుల నిరసన దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించిన కూనంనేని.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,జూన్ 29,సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, వారి పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. అఖిల భారత బొగ్గుగనుల అధికారుల సంఘం (ఐఎంఓఏ) సింగరేణి శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం అధికారులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించి వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రింబవళ్లు శ్రమించి సింగరేణి సంస్థను లాభాల బాటలో నడిపిస్తున్న అధికారుల పట్ల యాజమాన్యం, ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి వీడాలన్నారు. అధికారుల పే-రివిజన్, అలవెన్సులు, పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లాభాల్లో వాటా, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యం పై ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి అధికారుల సమస్యలపై చొరవ చూపాలని, లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు వంగ వెంకట్, జె గట్టయ్య,కిష్టాఫర్ తదితరులు పాల్గొన్నారు.

# పురాణ కథామృతం' పుస్తకావిష్కరణ.. రచయిత శ్రీధర్ రెడ్డిని అభినందించిన డీఈవో రాజు

సి కె న్యూస్ కొల్చారం నర్సాపూర్ :మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని గ్రాూ రంగంపేట లో ౕాష్ట్రంఎంఅఝుశ్రీ ణఅతీవఫ్శీతీ గా విధులు నిర్వహిస్తున్న తపస్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు ర్యావ శ్రీధర్ రెడ్డి రాసిన పురాణ కథామృతం పుస్తకాన్ని అవిష్కరిస్తున్న జిల్లా విద్యాధికారి శ్రీ రాజు గారు, ప్రధానోపాధ్యాయులు ఉపేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాల సిద్దు, కొల్చారం మండల తపస్ అధ్యక్షులు అచ్చన్నపల్లి లక్ష్మీనారాయణ.

ఈ సందర్భంగా ణజూ రాజు గారు ఇలా పుస్తకం రాసి



విద్యార్థులకు అదర్శనంగా నిలిచిన శ్రీధర్ రెడ్డిని అభినందించారు.

# చెరువు కాల్వ పూడికతీత.




ఎమ్మెల్యే సహకారంతో.

సి కె న్యూస్ వలిగొండ. మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 29.మండల పరిధిలోని వేములకొండ గ్రామ ప్రజల సహకారంతో సర్పంచ్ ఏర్పుల వెంకటేశం ఆధ్వర్యంలో చెరువు కాలువ పూడికతీత నిర్వహించారు.గ్రామంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాగునీరు అందించడానికి కృషి చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు.గ్రామ రైతులకు సాగునీరు అందించడానికి ప్రజల సహకారంతో కృషి చేస్తున్న సర్పంచ్,పాలకవర్గాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంబటి సాయికుమార్ వార్డు సభ్యులు కట్ట జ్యోతి అశోక్,అంబటి గిరిబాబు,ఏర్పుల పద్మ యాదయ్య,కాడిగళ్ల రామనర్సింహ,ఇంజమూరి శ్రీను, పులిపలుపుల అండాలు మల్లేశం,బత్తుల సువర్ణ మల్లేష్,సలబద్రి అభినయ్,మాడుగుల స్వర్ణలత శేఖర్ నాయకులు పులిపలుపుల రాములు మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ రసూల్ నాయకులు ఏనుగుల నర్సింహ,ఏర్పుల గంగయ్య,పట్టేటి జగన్,సాధుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆరెగూడెం గ్రామంలో అర్ధరాత్రి దొంగల బీభత్సం

- తాళం వేసిన రెండు ఇండ్లలో చోరీ
- చట్టం వెల్దుర్తి నర్సాపూర్



సి కె న్యూస్ ప్రతినిధి మెదక్ జిల్లావెల్దుర్తి మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసి ఉన్న రెండు ఇండ్లలో నగదు తో పాటు వెండి బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు గ్రామానికి చెందిన ఏర్పుల నవీన్, చాకలి భాగ్యమ్మ తమ ఇండ్లకు తాళాలు వేసి ఊరెళ్ళారు గమనించిన దొంగలు తాళాలు పగలగొట్టి నవీన్ ఇంట్లో 60 తులాల వెండి కడియాలు 20 తులాల పట్ట గొలుసులు బంగారు పుస్తె. ఎత్తుకెళ్లినట్లు నవీన్ తెలిపారు భాగ్యమ్మ ఇంట్లో పదివేల నగదు తో పాటు 5 తులాల వెండి గొలుసు1 మాసం బంగారు ముక్కెర దొంగిలించినట్లు భాగ్యమ్మ తెలిపారు నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రాజు తెలిపారు.

# విద్యార్థులు 100% పాఠశాలకు హాజరయ్యేలా చూడాలి.

- జిల్లా విద్యాధికారి, డి. వాసంతి



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూన్ 29,

జిల్లా విద్యాశాఖ అధికారి డి. వాసంతి బూర్గంపహాడ్ మండలం లోని కేజి బివి బూర్గంపాడును ఆకస్మికంగా సందర్శించినారు. విద్యార్థులు ఉపాధ్యాయుల యొక్క హాజరును ఫేస్ రికగ్నిషన్ యాప్ ఎఫ్ ఆర్ ఎస్ లో పరిశీలించి, నలుగురు ఉపాధ్యాయులు గైర్హాజరవ్వడం గమనించి మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వవలసిందిగా సిబ్బందిని ఆదేశించారు. కొత్త అడ్మిషన్లు పరిశీలించి ఎన్రోల్మెంట్ ను ఇంకా పెంచాలని సూచించారు. వంట సామాగ్రి, సరుకులు, వంటగది టాయిలెట్స్ ను పరిశీలించి, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తరగతి గదిలో విద్యార్థులతో ముచ్చటించి వారి సామర్థ్యాలను పరిశీలించి, ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా మొదలగు వాటిని ఉపయోగించుకుంటూ విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. ఎటి పరిస్థిలో ఎవరూ కూడా పాఠశాలకు గైర్హాజరు అవ్వద్దని విద్యార్థులకు సూచించారు.ఒక వారం రోజుల్లో మరల పాఠశాలకు తిరిగి వస్తానని, ఈసారి వచ్చేలోగా అందరు విద్యార్థులు పాఠశాలకు సక్రమంగా హాజరయ్యేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు.

ఈ కార్యక్రమం లో జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్. సతీష్ కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యా హబ్ గా మారనున్న కొత్తగూడెం జిల్లా కేంద్రం



- యంగ్ ఇండియా స్కూల్ కొత్తగూడెం నియోజకవర్గానికి కీర్తి పతాక
- రూ.200 కోట్లతో అత్యాధునిక హంగులతో యంగ్ ఇండియా స్కూల్
- 25 ఎకరాల భారీ విస్తీర్ణంలో నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి
- అన్ని వర్గాలకూ ఒకే క్యాంపస్ విద్య ఆలోచన అభినందనీయం
- వచ్చే విద్యాసంవత్సరంలో అందుబాటులోకి యంగ్ ఇండియా స్కూల్
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణపనులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూలై 29, ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏర్పాటు కానున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కొత్తగూడెం నియోజకవర్గానికి ఒక కీర్తి పతాక అని, ఈ స్కూల్ ఏర్పాటుతో కొత్తగూడెం జిల్లా కేంద్రం గొప్ప విద్యా హబ్'గా మారబోతోందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణ పనులను సోమవారం ఆయన అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. కులమతాలకతీతంగా అన్ని వర్గాల విద్యార్థులకూ ఒకే క్యాంపస్ లో విద్యను అందించాలనే ప్రభుత్వ ఆలోచన ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ ప్రాజెక్టు కింద కొత్తగూడెం క్యాంపస్ లో రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో అత్యంత అత్యాధునిక హంగులతో ఈ స్కూల్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. 25.475 ఎకరాల భారీ విస్తీర్ణంలో, 5,38,246 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో నిర్మిస్తున్న ఈ భారీ నిర్మాణాల్లో అకడమిక్ బ్లాక్, జూనియర్, సీనియర్ హాస్టల్ బ్లాకులు, డైనింగ్, కిచెన్ లతో పాటు సిబ్బంది కోసం క్వార్టర్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఈ సరికొత్త స్కూల్ ను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్దేశించుకొని పర్యవేక్షిస్తున్నామని, తెలిపారు. ఈ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం బోధనతో పాటు డిజిటల్ స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, కంప్యూటర్ సెంటర్లు, సైన్స్ ల్యాబ్‌లు, 5000 పైగా పుస్తకాలతో కూడిన డిజిటల్ లైబ్రరీలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసం కోసం 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్, క్రికెట్ గ్రౌండ్, వాలీబాల్, బాస్కెట్ బాల్, కబడ్డీ కోర్టులను ప్రత్యేకంగా నిర్మిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా, పర్యావరణ హితంగా ఉండేలా సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, సౌర, పవన విద్యుత్ వ్యవస్థలను, నీటి సంరక్షణ కోసం రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ విధానాలను ఇక్కడ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో రవాణాసౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని, ఇప్పటికే రోడ్లు, బ్రిడ్జీలు, అండర్ బ్రిడ్జీలు, ఓవర్ బ్రిడ్జీలు, ఔటర్ రింగు రోడ్లు కొన్ని నిర్మాణ దశలో ఉండగా, మరికొన్నింటికీ మంజూరు లభించిందని తెలిపారు. అన్ని కులాలవారికి 17 కమ్యూనిటీహాలు మంజూరు చేయడం జరిగిందని, ఎయిర్పోర్టు, అంతర్జీతీయ క్రికెట్ స్టేడియం, క్రీడామైదానాలు, జిమ్ ఏర్పాటు కాబోతున్నాయని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు శక్తివంచ లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. విలేకర్ల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, కమిషనర్ సుజాత, డీఈవో వాసంతి, పాఠశాలల భవనాల పర్యవేక్షణ అధికారి వెంకటేశ్వర్ రావు, వివిధ శాఖల అధికారులు హేమచంద్ర రావు, రాజగోపాల్, నాయకులు వాసిరెడ్డి మురళి, యూసుఫ్, ధర్మరాజు, కార్పొరేటర్లు ఎర్రబెల్లి శంకర్, దుర్గ, సుధాకర్, పద్మ, ఆకాంక్ష, హిమశ్రీ, బండి నర్సింహా, విజయ్, తులశమ్మ, సహేరా, కళావతి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆశీర్వదించిన : కూరపాటి.




సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.ముదిగొండ మండలం వల్లాపురం గ్రామానికి చెందిన ఎన్నిడి నాగేశ్వరావు– సీతమ్మ దంపతుల కుమార్తె చరితశ్రీ ఓణీల వేడుక, మరియు కుమారుడు మురళికృష్ణ పంచకట్టు వేడుకకు చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్ హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో... చింతకాని మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కంచమర్తి రామకృష్ణ (తీఎ)మధిర ఆత్మ కమిటీ డైరెక్టర్ సట్టు వెంకటేశ్వర్లు, మధిర నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అనిల్ కుమార్ వేర్పుల, చింతకాని మండల సేవదళ్ అధ్యక్షులు పర్చగాని సతీష్, బంధువులు తదితరులు పాల్గొని ఆశీర్వదించారు.

## శ్రీ వెంకటేశ్వర బెంగళూరు బేకరీ ప్రారంభం.







సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 29.
వలిగొండ మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో నూతనంగా శ్రీ వెంకటేశ్వర బెంగుళూరు బేకరీ షాపును ప్రోపరేటర్ వీకే రంగనాథ్ గిరిజాలు సోమవారం ప్రారంభించారు గత 20 సంవత్సరాలుగా వలిగొండ పట్టణ కేంద్రంలో బేకరీ నడుపుతూ నాణ్యమైన బర్త్ డే కేకులు స్వీట్లు బిస్కెట్లు కూల్ డ్రింక్స్ ఐస్ క్రీములను.ఎగ్ పప్పులు కర్రీ పప్పులు.అన్ని రకాల వస్తువులు సరసమైన ధరలకు మావద్ద లభించునని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## వైభవంగా శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు.

అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దిగ్విజయం చేయాలి.







సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 29.
మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో శ్రీశ్రీశ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ దేవాలయమైన.శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉ.8 గంటలకు అంకురార్పణ హోమం. మ. 12 గంటలకు ధ్వజరోహణం గరుడ ముద్ద. రా 8 గంటలకు ఎదుర్కోలు మహోత్సవం.రా 8:30 నిమిషములకు. శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని.ఈ కళ్యాణ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందగలరని. ఆలయ ఈవో కొత్తపల్లి వెంకటయ్య కోరారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కరకంటి కలమ్మ యాదయ్య ఉప సర్పంచ్ పోలేమేని మమత లింగస్వామి శ్రీ మత్స్యగిరిగుట్ట మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ రెడ్డి మాజీ సర్పంచ్ కొత్త నరసింహ పంచాయతీ కార్యదర్శి శ్రీశైలం గ్రామ పెద్దలు అర్చకులు సిబ్బంది ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ ప్రారంభించిన ఎమ్మెల్యే



సి కె న్యూస్ కొల్చారం నర్సాపూర్ మెదక్ జిల్లా కొల్చారం మండలంలో ప్రీ ప్రైమరీ పాఠశాలను లాంఛనంగా ప్రారంభించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఇంటిదగ్గర అమల సర్పంచులు అప్పాచిపల్లి గ్రామ సర్పంచ్ గౌడ్ రంగంపేట కిష్టాపూర్ రాంపూర్ కొల్చారం మండల అధ్యక్షుడు రాంపల్లి గౌరి శంకర్ గుప్త కోనాపూర్ తునకలపల్లి సంతు తుక్కాపూర్ ఉపసర్పంచ్ ఆర్య రవీందర్

## లికురువపల్లి గ్రామంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహణ



సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల:గద్వాల మండలం కురువపల్లి గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయ పద్ధతిలో పూజలు చేశారు. రైతులు వ్యవసాయ పనిముట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఈ ఏడాది మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని భగవంతుడిని ప్రార్థించారు.
వేడుకల్లో గ్రామ పెద్దలు, రైతులు, యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, సంప్రదాయ సంస్కృతిని ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి రైతుల వ్యవసాయ జీవన విధానానికి నాంది పలికే ముఖ్యమైన పండుగగా గ్రామస్థులు పేర్కొన్నారు.

## రైతుల సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు సీఎం గారు

ఏరువాక పున్నమి పురస్కరించుకొని తోరణం లాగే కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే తనయుడు బండ్ల సాయి సాకేత్



సీకే న్యూస్ ప్రతినిధి గద్వాల
ఈ రోజు గద్వాల జిల్లా కేంద్రంలోని 32 వ వార్డ్ లో కౌన్సిలర్ ముత్యాల లక్ష్మి తనయుడు ముత్యాల రవి ఆధ్వర్యంలో ఏరువాక పున్నమి పండుగ పురస్కరించుకొని తోరణం లాగే కార్యక్రమాన్ని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లిఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారి తనయుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డి గారు హాజరయ్యారు.
ఎమ్మెల్యే తనయుడు గారు, ఉమ్మడి జిల్లా డైరెక్టర్, మున్సిపల్ చైర్ పర్సన్ గార్లు ముందుగా బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించి తోరణం లాగడం జరిగినది .
ఎమ్మెల్యే తనయుడు గారికి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికిన వార్డ్ కౌన్సిలర్, నాయకులు ప్రజలు
ఏరువాక పున్నమి పండుగ పురస్కరించుకొని తోరణం పోటీలలో గెలుపొందిన విజేతకు మున్సిపల్ చైర్ పర్సన్ గారు తరుపున (స్పాన్సర్ ) 5 తులాల వెండి ని బహూకరించారు.
ఎమ్మెల్యే తనయుడు గారు, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ గారు మున్సిపల్ చైర్ పర్సన్ గారు చేతుల మీదుగా గెలుపొందిన సద్దెల రాముడు ఐదు తులాల వెండి చైను బ్రాస్లెట్స్ అందజేశారు ...
ఎమ్మెల్యే తనయుడు గారు మాట్లాడుతూ......
గద్వాల నియోజకవర్గం ప్రజలందరికీ ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు.....
ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఆనవాయితీగా చింతలపేట లో తోరణం లాగే కార్యక్రమం ఘనంగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు.
సకాలంలో వర్షాలు బాగాపడి రైతులకు రెండు పంటలకు నీళ్లు అందించే విధంగా రైతులు పండించిన వరి ధాన్యమును ప్రభుత్వం కొనుగోలు చేసి రైతు ఆర్థికంగా ఎదగాలని కోరారు. అదేవిధంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిన్ను నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతున్ని ప్రార్థించారు.
ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహాలు యాదవ్, కౌన్సిలర్స్ చంద్రశేఖర్, నాయకులు గోవిందు, వంట భాస్కర్, ఇసాక్, ధర్మనాయుడు, రామాంజనేయులు, నాగేంద్ర యాదవ్, రామకృష్ణ, కిట్టు, చిరు, రాజు, నాయకులు కార్యకర్తలు రైతులు మహిళలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏరువాక పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న గద్వాల్ మాజీ మున్సిపల్ చైర్మన్



బి.ఎస్. కేశవ్ గారు

సి కె న్యూస్ ప్రతినిధి, గద్వాల్:గద్వాల్ పట్టణంలోని 8వ వార్డు బీసీ కాలనీలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా మాజీ కౌన్సిలర్ జయమ్మ – కోటేష్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంప్రదాయ కాడె ఎద్దుల ఊరేగింపు కార్యక్రమంలో గద్వాల్ మాజీ మున్సిపల్ చైర్మన్ బి.ఎస్. కేశవ్ గారు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా బి.ఎస్. కేశవ్ గారు మాట్లాడుతూ, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ముందుకు సాగడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రైతు దేశానికి వెన్నెముక అని, రైతన్నల కృషి వల్లే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.
ఏరువాక పౌర్ణమి వంటి పండుగలు గ్రామీణ జీవన విధానానికి ప్రతిబింబమని, ఇలాంటి కార్యక్రమాలు యువతలో సాంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందిస్తాయని తెలిపారు.
అలాగే, ఈ ఏడాది రైతులకు అనుకూల వాతావరణం ఏర్పడి, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి రైతు కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు పులిపాటి వెంకటేష్ గారు, చిత్తారి కిరణ్ గారు, గోపాల్ గారు, కమ్మరి రాము గారు, మోహన్ గారు, చంటన్న గారు, రాము గారు పాల్గొనగా, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మహేష్, దడవాయి నర్సిములు, మేస్త్రి ఆంజనేయులు, అయ్యూబ్, కేశవ్, దర్శల్లి, మధు, రమేష్, గోపాల్, రంగన్న, గుండు నర్సిములు, శ్రీను, రాజు, చిన్ను తదితరులు హాజరయ్యారు.

# ఏపీలో పెన్షన్ల పై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కీలక ప్రకటన



**అమరావతి, (సి కే న్యూస్) జూన్ 29:** రాష్టంలో ఎప్పటి లాగే జులై నెల కోసం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల విడుదలకు రంగం సిద్దమవుతోంది. ఈ పెన్షన్ల కోసం ప్రభుత్వం ముందస్తుగానే నిధులు విడుదల చేయడం ద్వారా ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తోంది.

ఈసారి కూడా ఆ విధంగానే మొత్తం రూ.2,711.79 కోట్ల నిధుల్ని జులై నెల పెన్షన్ల కోసం విడుదల చేసింది. దీనికి సంబంధించిన వివరాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటన ద్వారా వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ నెలలో 62,19,648 మంది పింఛన్ దారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2,711.79 కోట్లను విడుదల చేసినట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. జులై 1 వ తేదీ ఉదయం నుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఈ పెన్షన్లు పంపిణీ చేస్తామని తెలిపారు. కొత్తగా మంజూరైన 7,792 మంది వితంతు లబ్ధిదారులకు జులై 1న పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం రూ. 3.12 కోట్లను విడుదల చేసినట్టు కూడా మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నప్పటి నుంచి ఇప్పటి వరకు పెన్షన్ల కోసం ఈ నెల విడుదల చేసిన నిధులతో కలుపుకుని రూ. 68,598.44 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని మంత్రి శ్రీనివాస్ తెలిపారు. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నిధులను ప్రతి నెలా 1 వ తేదీనే లబ్ధిదారులకు అందిస్తోందని మంత్రి వెల్లడించారు. తాజాగా వితంతు పెన్షన్లను కూడా ఇస్తున్న ప్రభుత్వం, ఇతర కొత్త పెన్షన్ల పై త్వరలో నిర్ణయం తీసుకోనుందన్నారు.

## చెరీ చెరువు సుందరీకరణ పనులకు ఘనంగా శంకుస్థాపన.

**శాసనసభ్యులు కొణతాల రామకృష్ణతో కలిసి శంకుస్థాపన చేసిన కలెక్టర్ విజయ క్రిష్ణన్.**





**అనకాపల్లి, (సి కే న్యూస్) జూన్ 29 :** ప్రతి పొలానికి నీరు అనే నినాదంతో నీటిపారుదల ద్వారా సాగు విస్తీర్ణాన్ని పెంచడం, నీటి వృధాను తగ్గించి, నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం కశింకోట మండలం బయ్యవరం గ్రామంలో రూ. 50.00 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న "చెరీ చెరువు" సుందరీ కరణ పనులకు సంబంధించి శిలాఫలకాన్ని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తో కలిసి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆవిష్కరించారు. అనంతరం

జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డబ్ల్యూడిసిపి- పిఎంకేఎస్వై 2.0 పథకం కింద ఈ నిధులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. గ్రామ పరిధిలో ఉన్న చెరీ చెరువును ఆధునీకరించి, పునరుద్ధరించడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచు కోవచ్చన్నారు. ఈ పునరుద్ధరణ పనుల వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందడమే కాకుండా, స్థానిక రైతులకు సాగునీరు, పశువులకు తాగునీరు పుష్కలంగా లభిస్తుందని తెలిపారు. శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ డబ్ల్యూడిసిపి- పిఎంకేఎస్వై 2.0 ద్వారా చెరువుల పునరుద్ధరణ చేపట్టి, కరవు పీడిత ప్రాంతాల రూపురేఖలను మార్చడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మండల పరిషత్ అధికారులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు బోల్తా...

### 14 మందికి స్వల్ప గాయాలు.. ఒకరు మృతి...

### వనపర్తి,కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రులకు క్షతగాత్రులను తరలింపు

### సహాయక చర్యల్లో ఎస్ఐ వెంకటేష్ గౌడ్







**పెబ్బేరు జూన్29 (సి కే న్యూస్)**వనపర్తి జిల్లా పెబ్బేరు సమీపంలోని 44వ నెంబర్ రంగాపురం జాతీయ రహదారిపై ప్రయాణికులతో వెళ్తున్న టీజీఎస్ఆర్టీసీ బస్సు సోమవారం ఉదయం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 15 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు.

వనపర్తి డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు మంత్రాలయం నుండి కర్నూల్ మీదుగా వనపర్తి కి వస్తున్న క్రమంలో పెబ్బేరు మండలంలోని రంగాపురం జాతీయ రహదారి 44 పై అదుపుతప్పి బోల్తా పడటంతో 15 మంది ప్రయాణికులు గాయపడగా అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు.కాగా బస్సులో మొత్తం 61 మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తుండగా ఒక్కసారిగా ఈ ప్రమాదం జరిగే సరికి ప్రయాణికులు భయభ్రాంతులకు గురి అయ్యారు. విషమ పరిస్థితి ఉన్న ఒక్కరిని మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా స్వల్ప గాయాలైన వారిని వనపర్తి ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నారు.సంఘటన స్థలాన్ని డీఎస్పీ గిరిబాబు, సిఐ రాంబాబు, తహసీల్దార్ సత్యనారాయణ రెడ్డి పరిశీలించారు.

**బస్సు ప్రమాదంలో ఆర్టీసీ ఇంజనీర్ మృతి.. డ్రైవర్ పై కేసు నమోదు**

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపురం జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మహబూబ్ నగర్ డిప్యూటీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నగిరి శివరాంప్రసాద్ (59) మృతి చెందారు. మృతుడి కుమారుడు నగిరి సాయిసుదీంద్ర కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెబ్బేరు పోలీసులు బస్సు డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

**సహాయక చర్యల్లో ఎస్ఐ వెంకటేష్ గౌడ్**

రోడ్డు ప్రమాదం జరిగిన వేళ పోలీస్ అధికారి చూపిన చొరవ, మానవత్వం స్థానికులను, ప్రయాణికులను ముగ్ధులను చేశాయి. మంత్రాలయం నుంచి వనపర్తి వెళ్తున్న ఆర్టీసీ బస్సు జాతీయ రహదారిపై పెబ్బేరు సమీపంలో బోల్తా పడిన క్షణం నుంచి ఘటనా స్థలంలోనే ఉండి, అంతా తానై పర్యవేక్షించిన పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ పై ఇప్పుడు సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. "పోలీస్ అంటే ఇలానే ఉండాలి" అంటూ ప్రతి ఒక్కరూ ఆయనను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారు.బస్సు బోల్తా ప్రమాదం జరిగినట్లు సమాచారం అందిన వెంటనే ఎస్సై వెంకటేష్ గౌడ్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా సిబ్బందితో కలిసి స్పాట్‌కు చేరుకున్నారు. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారిన వేళ, ఆయన ఏమాత్రం తడబడకుండా రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు.బస్సులో చిక్కుకుపోయిన ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీయడంలో ఆయనే స్వయంగా రంగంలోకి దిగారు.క్షతగాత్రులను 108 అంబులెన్స్‌ల ద్వారా వెంటనే వనపర్తి, పెబ్బేరు ప్రభుత్వ ఆసుపత్రికి, తీవ్రంగా గాయపడిన 8 మందిని కర్నూలు ఆసుపత్రికి తరలించేలా దగ్గరుండి ఏర్పాట్లు చూశారు.ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు.ప్రమాదం జరిగినప్పటి నుంచి సహాయక చర్యలు పూర్తయి, క్రేన్ ద్వారా బస్సును పక్కకు తొలగించేంత వరకు ఆయన అక్కడే ఉండి అన్ని పనులను పర్యవేక్షించారు.

**వెల్లువెత్తిన ప్రశంసలు..**

రక్షక భటుడు అంటే కేవలం శాంతిభద్రతలను కాపాడటమే కాదు, ఆపదలో ఉన్న ప్రజలకు ఆపద్బాంధవుడిలా నిలవాలని ఎస్సై వెంకటేష్ గౌడ్ నిరూపించారని స్థానికులు కొనియాడారు. బస్సు బోల్తా పడిన క్షణం నుంచి చివరి వరకు అక్కడే ఉండి బాధ్యతగా వ్యవహరించిన తీరుపై ఉన్నతాధికారులు సైతం ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

## వరంగల్ పర్యటనలో సందర్భంగా నితిన్ నవీన్ బిజెపి పార్టీ జాతీయ అధ్యక్షులు కు ఘన స్వాగతం పలికిన బిజెపి పార్టీ శ్రేణులు నాయకులు.







**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 29.** యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని పగిడిపల్లి టోల్ ప్లాజా దగ్గర బిజెపి పార్టీ శ్రేణులు కార్యకర్తలు రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు బిజెపి పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నవీన్ వరంగల్ లో పర్యటనలో సందర్భంగా పగిడిపల్లి టోల్ ప్లాజా వద్ద వారిని సాధారణంగా ఆహ్వానించి శాలువాతో సన్మానం చేసి ఘనంగా స్వాగతం తెలిపిన బిజెపి పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర నాయకులు దాసరి మల్లేశం పోతంశెట్టి రవీందర్ కర్నాటి ధనంజయ సోలిపురం శ్రీకాంత్ రెడ్డి సిఎన్ రెడ్డి సందుపట్ల వెంకటేశం జిల్లా నాయకులు మంద నరసింహ ముదిరాజ్ సంఘం గ్రామం వారు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ ఏర్పాటు.



**విశాఖపట్నం, (సి కే న్యూస్) జూన్ 29:**విశాఖ పార్లమెంట్ నియోజకవర్గానికి 28 మంది తో జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ ని మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమవారం కమిటీ సభ్యుల సమావేశంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడారు. నేటి నుంచి ఐదు రోజులపాటు జనసేన నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ సమావేశాలు నిర్వహించడం జరుగుతుంది అన్నారు.

రోజుకు రెండు నియోజకవర్గాలు చొప్పున సమావేశాలు. నేడు జనసేన పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో కొత్త ఒరవడి కి స్వీకారం చుట్టారన్నారు.

నైపుణ్యం ఉన్న నాయకులను తయారు చేయాలనే ఉద్దేశంతో నూతన విధానంతో ముందుకు వెళ్తున్నారు. వినాశన మైన రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయడంలో కూటమి నాయకులు విజయంతమయ్యారు. నిర్వీర్యం అయిపోయిన గ్రామ పంచాయతీ లకు పవన్ కళ్యాణ్ జీవం పోసారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వాలని లక్ష్యంతో ముందుకు వెళుతున్నారు. నూతన విధానంతో జనసేన పార్టీ పునర్నిర్మాణం జరుగుతుంది. పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడంతో పాటు, అన్ని విధాల పార్టీని, సిద్ధం చేసేందుకు ఈ ప్రక్రియ. భోగాపురం పూర్తి స్థాయిలో, సిద్ధమయ్యేవరకు విశాఖ ఎయిర్పోర్ట్ ని కొనసాగిస్తే మంచిదని నా అభిప్రాయం అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో కూటమి పోటీ చేసి ఆ ప్రాంతాన్ని కైసం చేసుకోవాలనేది కూటమి ప్రయత్నం అని కొణతాల తెలియజేసారు.